ఒకటికూడి, చివరకు తీవ్రమైన గుణాత్మకమార్పు తీసుకువస్తాయి. "గుణం పరిమాణంగా మారుతుంది."

ఉదాహరణకు, ఉక్కును వేడిచేసినప్పుడు అది తన ఘనస్థితిని అలాగే వుంచుకుంటుంది. కాని దాని ఉష్ణోగ్రత ఒకకీలకస్థాయికి చేరుకున్నప్పుడు ఆ లోహం ఘనపదార్థంగా వుండక, ద్రవపదార్థ మవుతుంది.

అభివృద్ధి యొక్క క్రమాన్ని అర్థం చేసుకొనేందుకు పరిమాణం గుణంగా మారే ఈ గతితార్కిక మార్పు ప్రత్యేక ప్రాముఖ్యత వహిస్తుంది. ఎందుచేతంటే, కొత్త గుణం ఎలా ఏర్పడుతుందో అది తెలియజేస్తుంది. కొత్తగుణమనేది లేనిదే అభివృద్ధి వుండదు.

ఉదాహరణకు, సమాజపరిణామపు తొలిదశల్లో సహజోత్పత్తి విధానం (Nutnral Economy) అమల్లోవుండేది. ఒక్కొక్క జనసమూహం తన జీవితానికి కావలసిన వస్తువులన్నిటినీ తానే తయారు చేసుకునేది. తరువాత, ఉత్పత్తి పెరిగేకొద్దీ వర్తకపు సరకుల మార్పిడి ప్రారంభమైంది. అది అంతకంతకు తరచుగా, అంతకంతకు హెచ్చు ప్రమాణాలలో జరిగేది. చివరకు సమాజం యొక్క ఆర్థికజీవితంలో అది గొప్ప గుణాత్మక మార్పు లకు దారి తీసింది. సహజోత్పత్తి విధానం స్థానే వర్తకపు సరకుల ఉత్పత్తి విధానం (Commodity Economy) ప్రవేశించింది. ప్రజలు తమ ఉపయోగం కోసం కన్న ఇతరులతో యిచ్చి పుచ్చుకోడానికే ప్రధానంగా వస్తువులను తయారు చేయసాగారు.

అనేక పరిమాణాత్మకమార్పులనుంచి ఒక కొత్తగుణం ఉత్పన్నమైనప్పుడు దానికొక కొత్త పరిమాణాత్మకవిశిష్టత ఏర్పడుతుంది. అదే "గుణం పరిమాణంగా మారడం". ఉదాహరణకు, శ్రామికఉత్పాదకశక్తి (Producttivity of labour) పెరిగినప్పుడు గుణాత్మకంగా ఒకకొత్తరకపు యంత్రం తయారవుతుంది. పెట్టుబడిదారీ ఆర్థికవిధానంతో గుణాత్మకంగా భేదించే

సోషలిస్టుఆర్థికవిధానం పెట్టుబడిదారీ ఆర్థికవిధానంకంటె ఎక్కువవేగంతో అభివృద్ధి చెందుతుంది.

పరిణామాత్మక మార్పులు తీవ్రమైన గుణాత్మక మార్పులుగాను, గుణాత్మకమార్పులు పరిమాణాత్మక మార్పులుగాను పరివర్తనచెందడం *సార్వత్రికమైన గతితార్కిక అభివృద్ధిసూత్రం.* ఇది ప్రకృతి పరిణామాలన్నిటిలోను సమాజపరిణామాలన్నిటిలోను, భావపరిణామాలన్నిటిలోను, పాతవాటిస్థానే కొత్తవి ఉద్భవించే రంగాలన్నిటిలోను వర్తిస్తుంది.

లంఘన అనగా ఏమిటి?

అనేక పరిణామాత్మక మార్పులు ఒకదానితో ఒకటి కూడి పెద్ద సముదాయంగా అయినప్పుడు, ప్రతి వస్తువు అట్టి సమీకరణద్వారా ఒక గుణాత్మక స్థితినుంచి మరొకస్థితికి, నూతన స్థితికి పరివర్తనచెందడాన్నే *లంఘన* (Leap) అంటాము. లంఘన అంటే, ఒక వస్తువులో పరిమాణాత్మకమార్పు క్రమక్రమంగా జరిగే స్థితి భగ్నమవడ మన్నమాట. అది ఒక కొత్త గుణానికి పరివర్తన; అభివృద్ధిక్రమంలో ఒక తీవ్రమైన మార్పుకు అది చిహ్నం.

ఉదాహరణకు, జీవరాసుల అభివృద్ధిక్రమంలో మానవుని అవతరణ ఒక లంఘన. అంటే ఒక తీవ్రమైన మార్పు.

ఒక గుణంనుంచి మరోగుణానికి పరివర్తన, అంటే లంఘనవేగంగా జరుగుతుంది. కాని, నెమ్మదిగా జరిగే పరిమాణాత్మక మార్పులూ, వేగంగా జరిగే గుణాత్మకమార్పూ సాపేక్షమైనవి మాత్రమే. క్రమక్రమంగా ఒకదానితో ఒకటి కూడ్డంవల్ల జరిగే పరిమాణాత్మకమార్పుల దశలో పోల్చినప్పుడు మాత్రమే, ఆ తరువాత జరిగే లంఘనలు వేగమైన వవుతాయి. ఈ వేగంకూడ మారుతూవుంటుంది. ఆ వస్తువుయొక్క స్వభావాన్నిబట్టి, ఏ పరిస్థితుల్లో లంఘన జరుగుతుందో ఆ పరిస్థితుల్నిబట్టి అది వుంటుంది.

ప్రకృతిలోను, సమాజంలోను జరిగే పరిమాణాత్మక మార్పుల్ని తెలియజేసేందుకు మనం *పరిణామం* (Evolution) అనే మాట నుపయోగిస్తాం. ఒక్కొక్కప్పుడు క్రమంగా జరిగే పరిమాణాత్మక మార్పుల్ని తెలియజేసేందుకే కాక, విస్తృతార్థంలో పరిమాణాత్మక మార్పుల్నీ గుణాత్మక మార్పుల్నీ కూడా తెలియజేసే మొత్తం అభివృద్ధిని సూచించడానికి యీ మాటను ఉపయోగిస్తాం. ఆధునిక డార్విన్ సిద్ధాంతాన్ని జీవకోటియొక్క పరిణామాన్ని తెలియజేసే సిద్ధాంతంగా తరచు మనం వ్యవహరిస్తూవుంటాం. పరిమాణాత్మకమార్పులూ, గుణాత్మకమార్పులూ కూడా పరిణామంక్రిందికే వస్తాయని మన భావం. సామాజికజీవితంలో జరిగే లంఘనల్ని, గుణాత్మక మార్పుల్ని *విప్లవం* (Revolution) అని వ్యవహరిస్తాం. విప్లవం అనే మాట ప్రధానంగా సామాజికవ్యవస్థలో జరిగే గుణాత్మకమార్పుల్ని తెలియజేస్తుంది. కాని. విప్లవాలు యితర సామాజికరంగాల్లోకూడా జరుగుతాయి. ఉదా : సాంకేతికశాస్త్రం. ఉత్పత్తి. విజ్ఞానశాస్త్రం, సంస్కృతి.

పరిణామానికీ, విప్లవానికీ ఆంతరికమైన అవశ్య సంబంధం ఉంది. మానవసమాజం అనేక పరిణామాలద్వారా అభివృద్ధి చెంది చెంది, చివరకు ఒకానొకదశలో అనివార్యంగా లంఘనవంటి గుణాత్మక మార్పులకు లోనవుతుంది. అంటే, విప్లవాలు వస్తాయి. అలాంటి విప్లవాత్మక మార్పులు, అంటే గుణాత్మక మార్పులు నూతనమైన పరిమాణాత్మక మార్పుల దశకు, పరిణామాల దశకు నాందీప్రస్తావనలు.

పరిమాణాత్మక మార్పులు గుణాత్మక మార్పులకు దారితీస్తాయనే గతితార్కిక భౌతికవాద సూత్రం మార్క్సిజాన్ని ప్రతిఘటించే మితవాద, అతివాదశక్తులపై పోరాటంలో ఒక ప్రధానమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది. సోషలిస్టు విప్లవంయొక్క అవసరాన్ని నిరాకరిస్తూ సంస్కరణలద్వారా సోషలిజానికి పరివర్తన - పెట్టుబడిదారీ విధానం క్రమేణా సోషలిజంగా "వృద్ధిచెందడం" - సాధ్యమని చెప్పే సంస్కరణ వాదాన్ని

అది ప్రతిఘటిస్తుంది. రెండోవైపు, ఘటనలన్నీ సహజసిద్ధంగా అభివృద్ధి చెందుతాయనే విషయాన్ని గుర్తించకుండా, ప్రజల్లో చేయవలసిన దైనందిన కార్యకలాపాల ప్రాముఖ్యతను తక్కువ అంచనా వేసే అతివాద ధోరణు లున్నాయి. ఇట్టి ధోరణులు గలవారు ప్రజలను విప్లవానికి సన్నద్ధం చేసే పనికి, విప్లవశక్తుల్ని సంఘటితపరిచే పనికి ప్రాధాన్య మీయరు. ఇట్టి అతివాద ధోరణులు సిద్ధాంతరీత్యా నిలబడలేవని గతితార్కిక భౌతికవాదం రుజావుచేస్తుంది.

అభివృద్ధిని గురించిన అధిభౌతిక దృక్పథం, దానిఖండన

ప్రకృతిలో అభివృద్ధిని నిరాకరించే అధిభౌతిక (Metaphysical) దృక్పథాన్నెదుర్కోడంలో మార్క్స్, ఎంగెల్సులు గతితార్కిక భౌతిక వాదాన్ని రూపొందించారు. ఆ తర్వాత పరిస్థితులు మారాయి. 19 వ శతాబ్దపు ఉత్తరార్థంలో అభివృద్ధికి సంబంధించిన భావన చాలా విస్తృతంగా వ్యాపించింది (ప్రధానంగా డార్విన్ సిద్ధాంతం ఫలితంగా). అయినప్పటికీ, అధిభౌతిక దృక్పధం అదృశ్యం కాలేదు. అభివృద్ధిని గురించిన అపభ్రంశభావనల రూపంలో పాక్షికభావనల రూపంలో అది ప్రత్యక్ష మయింది. అభివృద్ధి ఉందా లేదా అనే సమస్యమీద కాకుండా, అభివృద్ధిని ఏవిధంగా అర్థంచేసుకోవాలి- అనే సమస్యమీద ప్రధానంగా నేడు గతితార్కిక భౌతికవాదం అధిభౌతికవాదా న్నెదుర్కొంటూంది.

అభివృద్ధిని గురించిన అధిభౌతిక ధోరణుల్లో ఒకటి, ప్రకృతి చిన్న చిన్నమార్పుల ద్వారానే, క్రమంగా వరుసగా జరిగే పరిమాణాత్మక మార్పుల ద్వారానే, అంటే పరిణామ రూపంలోనే అభివృద్ధి చెందుతోందనీ, విశిష్టమైన గుణాత్మకమార్పులు - లంఘనలవంటివి - ప్రకృతిలో జరగవనీ వాదిస్తుంది. ఈ అభిప్రాయాన్ని బలపరిచేవారు "ప్రకృతిలో లంఘనలుండవు" అంటారు. వీరు అభివృద్ధిలో పరిణామాన్ని తప్ప దేన్నీ గుర్తించరు. అందుచేత వీరిని

"సంప్రదాయ పరివర్తనవాదులు" (Trite evolutionists) అంటారు. 19వ శతాబ్దపు చివరిభాగంలో జీవించిన బ్రిటిష్‌తత్వవేత్త, సమాజవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు అయిన హెర్బర్ట్ స్పెన్సర్ యీధోరణిని బలపరచేందుకై "సంప్రదాయ పరిణామ వాదం" (Trite evolutionism) అనే ఒకతాత్విక సిద్ధాంతాన్ని రూపొందించాడు.

స్పెన్సర్ అభిప్రాయం ప్రకారం, అభివృద్ధి అంతా సౌమ్యంగా, క్రమంతప్పకుండా జరుగుతుంది; మూలపదార్థాలన్నీ ఒకదానితో ఒకటి చేరుతూ రాశి పెద్దదవడంద్వారా అది కొనసాగుతుంది. ఈ పరిణామంలోని దశలు పరిమాణాత్మకంగా భేదిస్తాయి; గుణాత్మకంగా భేదించవు.

స్పెన్సర్ రూపొందించిన "సంప్రదాయ పరిణామవాదం" తత్వశాస్త్రం లోను, ప్రకృతిశాస్త్రంలోను ఉన్న అనేక పాజిటివిస్టు ధోరణులపై చాల ప్రభావం కలిగించింది. అనేకమంది బూర్జువా సిద్ధాంతవేత్తలు, రివిజనిస్టులు దాన్ని బలపరిచారు. మార్క్సిస్టు గతితార్కికభౌతికవాదంపైన, శ్రామిక విప్లవాన్ని గురించి మార్క్స్-ఎంగెల్స్ చెప్పిన ఉపదేశాలపైన పోరాటం జరపడంలో అది బాగా ఉపయోగపడింది.

"సంప్రదాయ పరిణామవాదం" తప్పు సిద్ధాంతం అని స్పష్టంగా కని పిస్తూండడంవల్లా, వాస్తవవిషయాలతో అది భేదిస్తూండడంచేతా యింకొక సిద్ధాంతం ఉత్పన్నమైంది. పైకి అది "సంప్రదాయ పరిణామవాదా"నికి పూర్తిగా భిన్నమైన సిద్ధాంతంగా కనిపిస్తుంది. కాని దానివలెనే యిదికూడా పాక్షికమైనది, అధిభౌతికస్వభావం గలదీను. దీన్నే "సృజనాత్మక పరిణామ వాదం" (Creative evolutionism) అని పిలుస్తారు. ఇది 20 వ శతాబ్దంలో ఒక ఫ్యాషన్‌గా తయారయింది.

"సంప్రదాయ పరిణామవాదులు" కేవలం పరిమాణాత్మకమార్పుల్నే చూస్తే, "సృజనాత్మక పరిణామవాదులు" కేవలం గుణాత్మకమార్పుల్నే

చూస్తారు. అభివృద్ధి అంతా "సృజనాత్మకమైన"దనీ, కొత్తకొత్త రూపాల్లో అది సాక్షాత్కారమవుతుందనీ వారివాదన. కాని వారు గుణాత్మకమార్పులకూ, వాటికిముందు జరిగే పరిమాణాత్మక మార్పులకూ గల అనివార్య సంబంధాన్ని చూడరు. అభివృద్ధిక్రమంలో కొత్తకొత్త రూపాలు ప్రకృతి నియమాల ప్రభావంవల్ల ఉత్పన్నమవుతాయని చెప్పలేమనీ, ఏదోఒక ఆధ్యాత్మికమైన విచిత్రశక్తివల్ల, "సృజనాత్మకశక్తి"వల్ల అభివృద్ధి కొనసాగుతూ కొత్తకొత్తరూపాలు ఉత్పన్నమవుతాయనీ, యిదితప్ప మరోకారణం చెప్పడం సాధ్యంకాదనీ వీరంటారు.

ఈ విధంగా, "సృజనాత్మక పరిణామవాదం" అనే కొత్త సిద్ధాంతం పాత ఈశ్వరభావానికి దారితీస్తోంది; దాని శాస్త్రీయ విరుద్ధత స్పష్టంగా బహిర్గతమయింది.

అభివృద్ధిని గురించిన అధిభౌతిక దృక్పథాన్ని శాస్త్రీయమైన గతి తార్కిక దృక్పథం వ్యతిరేకిస్తుంది. అభివృద్ధిలో క్రమక్రమంగా జరిగే పరిమాణాత్మక మార్పుల్నీ, గుణాత్మక మార్పుల్నీ కూడా అది గుర్తిస్తుంది.

3. అభివృద్ధికి మూలం విరుద్ధశక్తుల మధ్య ఘర్షణ

పరిణామాత్మక మార్పులు పరంపరగా జరిగేటప్పుడు, ఒకానొక దశలో పాత గుణం కొత్త గుణంగా మారుతుందనీ, అలా మారడమే అభివృద్ధి క్రమమనీ పైన చూచాం.

అయితే, యీ అభివృద్ధి కంతకూ చోదకశక్తి ఏది? మూలం ఏది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం గతితార్కిక భౌతికవాదం యొక్క అతి ప్రధానమైన కర్తవ్యం. అట్టి సమాధానానికి మొదటిమెట్టు, వాస్తవికతయే విరుద్ధలక్షణాలను కలిగివుంటుందని గుర్తించడం.

గతితర్కం యొక్క చరిత్రను గురించి

ప్రాచీనకాలంలో కూడ, భౌతిక ప్రపంచం యొక్క అనంత వైవిధ్యంలో (Diversity) విరుద్ధ ధర్మాలు, శక్తులు, ధోరణులు స్పష్టంగా కన్పిస్తున్నాయనీ, అవి చాల ప్రధానమైన పాత్ర వహిస్తున్నాయనీ విజ్ఞులు గమనించారు. అంతేకాదు. ఈ విరుద్ధశక్తులు ఒకదాని ప్రక్క ఒకటి ఉండడమేకాక. అన్యోన్యసంబంధం కలిగివుంటాయనీ ఒకేవస్తువులో లేదా పరిణామంలో అవి ఉత్పన్నమవుతాయనీ, ఒకే వస్తువుయొక్క లేదా పరిణామం యొక్క రెండు పార్శ్వాలనీ వారు గుర్తించారు.

పూర్వం చైనా, ఇండియా, గ్రీసు మొదలైన దేశాల్లో చాలమంది తత్వవేత్తలు, వస్తువుల మూలాన్ని గురించీ, వాటి ఉనికిని గురించీ తెలుసుకోవాలంటే ఏ విరుద్ధశక్తులు వాటిలో ఉన్నాయో గుర్తించాలని తెలియజేశారు.31 వేడి - శీతలం పొడి - తడి. శూన్యం - పూర్ణత, స్థితి - అస్థితి మొదలైనవన్నీ ఇలాంటి విరుద్ధశక్తులక్రిందికి వస్తాయని వారా రోజుల్లో భావించారు.

మార్పుకంతకూ చోదకశక్తి విరుద్ధశక్తులమధ్య సంఘర్షణేనని ప్రాచీన కాలంలో తత్వవేత్తలు తెలియజేశారు. ఉదాహరణకు ప్రాచీన గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ "ప్రతీదీ సంఘర్షణద్వారా జరుగుతుంది" అనీ, సంఘర్షణే సకల వస్తువులకూ మూలం అనీ. "పిత" అనీ బోధించాడు. ఈ విరుద్ధశక్తులు వేటికవి ఘనీభవించి పోవనీ, మార్పులేకుండా వుండవనీ, ఒకదాని కొకటి సాపేక్షమైనవనీ, ఒకదానితో ఒకటి ఒకే అర్థంలో భేదిస్తాయనీ, కొన్ని సందర్భాలలో ఒకటి రెండవదానిలోను రెండవది మొదటి దానిలోను ప్రవేశిస్తాయనీ ప్రాచీన గతితార్కికులు తెలుసుకున్నారు. నిజంగా ఇవి అద్భుతమైన ఊహలు. ఈ అభిప్రాయాలను వారు అశిక్షిత రూపంలో చెప్పినప్పటికీ, అవెంతో విలువైన అభిప్రాయాలు.

ఫ్యూడల్ సమాజంలో క్రైస్తవపీఠం. ప్రకృతిని గురించి స్వతంత్రంగా పరిశీలనలు జరిపే శాస్త్రవేత్తల్ని హింసించింది. ఆ రోజుల్లో విరుద్ధ శక్తులమధ్య ఐక్యత, ఘర్షణ అనేభావం వెనుకబడిపోయింది. పెట్టుబడివారీ సమాజం ఏర్పడే కాలంలో ఈ విరుద్ధశక్తుల సమస్య తిరిగి నలుగుర్ని ఆకర్షించింది. 15 వ శతాబ్దంలో ఎన్. కుజాన్‌స్కీ. 16 వ శతాబ్దంలో గియోర్డానో బ్రూనో లాంటి ప్రముఖతత్వవేత్తలు ఈ సమస్యపై చాలా కృషి చేశారు. సామాన్య ఆలోచన గలవారు విరుద్ధశక్తులమధ్య పొత్తు వుండదన్నట్లు భావిస్తారనీ (అంతము–అనంతము. వంకర–తిన్నని వగైరా) లోతుగా ఆలోచించేవారు వాటిమధ్య ఐక్యతను, "విరుద్ధశక్తుల ఏకత్వాన్ని" కనిపెట్ట గలరనీ వారు తెలియజేశారు.

17 వ 18 వ శతాబ్దాలలో వ్యాప్తిచెందిన యాంత్రికవాద ప్రకృతి శాస్త్రం గతితర్కాన్ని, ముఖ్యంగా విరుద్ధశక్తుల సూత్రాన్ని అభివృద్ధి చేసేందుకు సుముఖత చూపలేదు. ఐనప్పటికీ, ఆరోజుల్లోకూడా విప్లవానికి పూర్వం జరిగిన ఘటనలను, సంబంధాలను పరిశీలించిన కుశాగ్రబుద్ధులు సామాజిక జీవితంలోను, చరిత్రలోను విరుద్ధశక్తుల ప్రాధాన్యాన్ని గురించి చాల విలువైన అభిప్రాయాలు తెలియజేశారు. ఆనాటి సమాజంలో చాలా తీవ్రమైన ఘర్షణలు, పోరాటాలు జరుగుతూ వుండేవి (ఉదాహరణకు, దిదిరో వ్రాసిన Rameau's Nephew లేక రూసో వ్రాసిన The Origin and reasons of Inequality).

18 వ శతాబ్దం చివర, 19 వ శతాబ్దం మొదట విరుద్ధశక్తుల సమస్య అనేకమంది జర్మన్ తత్వవేత్తల దృష్టిని ఆకర్షించింది. హెగెల్ దానిని తన తత్వశాస్త్రంయొక్క మూలసూత్రాల్లో ఒకటిగా పరిగణించాడు. అభివృద్ధిక్రమం అంటే విరుద్ధశక్తుల్ని బహిర్గతమొనర్చడం ద్వారా లభించే ఐక్యతనుంచి మరో కొత్త ఐక్యతకు పురోగమించడమనీ ; ఒక వస్తువు లేదా పరిణామం తనకు విరుద్ధమైన వస్తువుగా లేక పరిణామంగా మారడ

మనీ అతడు నిర్వచించాడు. ఒకానొక పరిణామంలో విరుద్ధశక్తులు కలిసి వుండడాన్ని అతడు "వైరుధ్యం" (Contradiction) అని పిలిచాడు. కాని హెగెల్ భావవాది కావడంచేత. వాస్తవికతలో ఉండే వైరుధ్యాలను అఖండభావం (Absolute Idea) యొక్క తార్కిక అభివృద్ధిలో వైరుధ్యాలుగా అతడు పరిగణించాడు.

మార్క్సిజం స్థాపకులు హెగెల్ గతితర్కాన్ని భౌతికవాద దృష్టితో పునర్నిర్మించారు. "వైరుధ్యం" అనే మాటను వారు యథాప్రకారంగానే వుంచి, దానికి మరో అర్థాన్ని, భౌతికవాదపరమైన అర్థాన్ని యిచ్చారు.

గతితార్కిక వైరుధ్యం, దాని సార్వత్రికత

గతితార్కికవైరుధ్యం అంటే మార్క్సిజం చెపుతున్న అర్థం యిది: ఒకపరిణామంలో, లేదా క్రమంలో పరస్పరవిరుద్ధమైన పార్శ్వాలుంటాయి. అవి ఏకకాలంలో ఒకదానొకటి ఆశ్రయించుకొని వుంటాయి; ఆ పరిణామం యొక్క పరిధిలో అవి అన్యోన్యసంబంధం కలిగి వుంటాయి.

ప్రాచీన గతితార్కికులు విరుద్ధశక్తుల ఐక్యత అనే సిద్ధాంతాన్ని ఊహాజగత్తులో నిర్మించారు. దానికి ప్రాతిపదిక. ప్రత్యక్షంగా వాస్తవికతను చూడ్డం. దాన్ని గురించి ఆలోచించడమూను. కాని మార్క్సిస్టులు అలా కాదు. వాస్తవికతకు సంబంధించిన అన్నిరంగాలను పరిశోధించడం ద్వారా శాస్త్రవేత్తలు సమీకరించిన వాస్తవ విషయాలనుంచి మార్క్సిస్టులు ఈ సిద్ధాంతాన్ని రూపొందించారు.

నిజానికి ప్రకృతి పరిణామాలను పరిశీలించినా, సామాజిక సంబంధాలను గమనించినా, మనోవ్యాపారాలను శోధించినా, వైరుధ్యాలు- అనగా విరుద్ధ పార్శ్వాల మధ్య లేదా ధోరణుల మధ్య ఘర్షణలు- ద్యోతకమౌతాయి.

మనం ఏ వస్తువునైనా విశ్రాంతి స్థితిలో చూచినప్పుడు, అందులో భిన్న లక్షణాలు. ధర్మాలు కనిపిస్తాయి. అందులో విరుద్ధ శక్తుల మధ్య "ఘర్షణ" మన దృష్టికి రాకుండా పోవచ్చు. అంటే, వైరుధ్యాలను మనం గమనించకపోవచ్చు. కాని, మన మొకవస్తువు యొక్క గతిని, మార్పును. అభివృద్ధిని పరిశీలించడానికి పూనుకున్న వెంటనే అందులో మనకు విరుద్ధ పార్శ్వాలు, క్రమాలు కనిపిస్తాయి.

ఉదాహరణకు, మనం ఒక మొక్కయొక్క, లేదా జంతువుయొక్క జీవకణంనుంచి ఒకభాగాన్నివిడదీసి దాన్ని ఒక సూక్ష్మదర్శిని క్రింద పరిశీలించేటప్పుడు దాని అంగనిర్మాణాన్ని మాత్రమే చూడగల్గుతాము. అంటే దాని గోడనూ, అణుగర్భాన్నీ. జీవపదార్థం (Protoplasm) మొదలైనవాటినీ మాత్రమే చూడగలం. కాని ఒక సజీవకణాన్ని పరిశీలిస్తే. అందులో విచూషణ, విచ్ఛేదన (Assimilation and dissimilation) అనే భిన్నక్రమాలను మనం చూడగలుగుతాం. అందులో వున్న వివిధ భాగాలు వృద్ధిచెందడం. నశించడం మనకు కనిపిస్తుంది.

విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన అన్నిరంగాలలోను ఈ విరుద్ధశక్తులు, వైరుధ్యాలు యెన్నో మనకు కనిపిస్తాయి. గణితశాస్త్రం కూడిక-తీసివేత, వర్గీకరణ-సమీకరణ వంటి విరుద్ధప్రక్రియలను పరిశీలిస్తుంది. యాంత్రికశాస్త్రం చర్య-ప్రతిచర్య, ఆకర్షణ-వికర్షణ (Repulsion)లాంటి వాటిని పరిశీలిస్తుంది. భౌతికశాస్త్రం ధనాత్మక-ఋణాత్మక (Positive and Negative) విద్యుదావేశాల్ని పరిశీలిస్తుంది. రసాయనశాస్త్రం పరమాణువుల సంకీర్ణ వికీర్ణాలను (Combination and dissociation) పరిశీలిస్తుంది. శరీరశాస్త్రంలో నాడీమండలాన్నిగురించిన విభాగం మజ్జాముఖంలో జరిగే ప్రకోప - నిరోధాలను (Excitation and inhib ion) పరిశీలిస్తుంది. సమాజ విజ్ఞానశాస్త్రం వర్గపోరాటం మొదలైన విరుద్ధశక్తుల్ని పరిశీలిస్తుంది.

మానవ ఆలోచన. జ్ఞానసంపాదన కూడ గతితార్కికవైరుధ్యమనే

సూత్రంచే నిర్ధారింపబడుతున్నాయి. ఉదాహరణకు. జ్ఞానసంపాదనక్రమంలో మనం నిత్యం విభిన్నదృక్పథాలమధ్య ఘర్షణలను చూస్తూవుంటాం. పాత సిద్ధాంతాలకూ కొత్తవాస్తవాలకూ మధ్య వైరుధ్యాలు మనల్ని నిరంతరం ఎదుర్కొంటూ వుంటాయి. ఇలాగే యింకా ఎన్నో.

విరుద్ధశక్తులమధ్య ఘర్షణే అభివృద్ధి

అభివృద్ధి క్రమాన్ని విశ్లేషించడంలో వైరుధ్యభావం అత్యంత ప్రాధాన్యం వహిస్తుంది. ప్రకృతిలోను, సామాజిక జీవితంలోను, ఆలోచన లోను పరస్పరవిరుద్ధమైన లక్షణాలు. ధోరణులు బహిర్గతమవుతాయి : వాటిమధ్య "ఘర్షణ" జరుగుతుంది ; ఆ ఘర్షణ ఫలితంగా పాతరూపాలు నశిస్తాయి ; కొత్తవి ఉద్భవిస్తాయి. ఇదీ అభివృద్ధికి సంబంధించిన సూత్రం. "అభివృద్ధి అంటే విరుద్ధశక్తులమధ్య 'ఘర్షణ'" అని లెనిన్ వ్రాశాడు. *

ఈ సూత్రాన్ని మనం ముక్కుకు సూటిగా అర్థంచేసుకో కూడదు. విరుద్ధశక్తులమధ్య ఘర్షణ అనే ప్రయోగం ముక్కస్యముక్కార్థః మానవ సమాజంలోనే ప్రధానంగా వర్తిస్తుంది. జీవరాసుల విషయంలో ఈ శబ్దాన్ని ముక్కస్యముక్కార్థః ఉపయోగించడం ఎన్నడూ సాధ్యంకాదు. నిర్జీవ ప్రకృతికి యిది మరీ అరుదుగా వర్తిస్తుంది కనుకనే, లెనిన్ ఈ మాటను కొటేషన్‌గుర్తులలో పెట్టాడు. విరుద్ధశక్తులమధ్య ఘర్షణ అంటే ఏమిటో తెలుసుకోడానికి మనం యీ మినహాయింపులను దృష్టిలో ఉంచుకోవాలి.

ఒకే ఒక శక్తి విరుద్ధశక్తులుగా విభజింపబడి వుంటుందనీ, ఈ విరుద్ధశక్తులమధ్య పరస్పరప్రతిరోధం, లేదా "ఘర్షణ" సహజసిద్ధమనీ గతితర్కం బోధిస్తుంది. ఇదే దాని మూలసూత్రం. సార్వత్రికనియమం. ఒకే ఒకశక్తి రెండుగా విభజింపబడివుంటుందనీ, దాని విరుద్ధపార్శ్వాలమధ్య

---

* లెనిన్ : వర్క్స్ : 38 వ సంపుటి, పుట 358 (Marx - Engels - Marxism, Moscow 1953 ; పుట 365)

ఘర్షణ జరుగుతూఉంటుందనీ తెలుసుకోవడం గతితర్కంయొక్క అత్యంత ప్రధానమైన సూత్రాల్లో ఒకటని లెనిన్ నొక్కిచెప్పాడు. నిజంచెప్పాలంటే, "గతితర్కంయొక్క అంతస్సత్యమే యిది."•

అభివృద్ధి అంతా- నక్షత్రాల పరివర్తనగాని, మొక్కల పెరుగుదల గాని, మానవుని జీవితం గాని, సమాజచరిత్ర గాని - వైరుధ్యాలతో నిండి వుంది. నిజానికి అభివృద్ధి అతిసాధారణరూపంలో ఎలా జరుగుతుందంటే, ప్రతివస్తువు ఏక్షణంలోనైనాసరే తన అభేదతను (Identity) నిలుపు కొంటూ అదేసమయంలో దాన్ని కోల్పోతూ ఉంటుంది. దాని విశిష్టత నిలిచివుంటూనే, మార్పు చెందుతుంది; అన్యవస్తువుగా అవుతుంది.

ఎంగెల్స్ యిలా వ్రాశాడు : "ఒకానొక వస్తువు యథాతథంగా ఉంటూనే నిరంతరం మార్పుచెందుతుంది. ఇందులోనే వుంది దాని వైరుధ్యం. 'జడత్వం', 'మార్పు' అనే విరుద్ధశక్తుల సంచయం ఇది."•

అభివృద్ధి చెందే ప్రతి వస్తువులోను, మరోవస్తువుయొక్క బీజం, తనను వ్యతిరేకించే మరోశక్తి ఉంటుంది. ఆ వస్తువు జడస్థితిలో స్థిర రూపంలో ఉండకుండా అది చేస్తుంది. అదే దాని "విరోధశక్తి". అంటే, అభివృద్ధి చెందే ప్రతివస్తువులోను ఒక భౌతిక వైరుధ్యం ఉండితీరుతుంది. రెండు విరుద్ధధోరణులు ఆ వస్తువులో పనిచేస్తూ ఉంటాయి. విరుద్ధ శక్తుల మధ్య లేదా విరుద్ధ పార్శ్వాలమధ్య పరస్పర ప్రతిరోధం, "ఘర్షణ" జరుగుతూ వుంటుంది. చివరకు ఈ ఘర్షణ, వైరుధ్యం పరిష్కార మవ డానికి దారితీస్తుంది ; ఆ వస్తువులో తీవ్రమైన, గుణాత్మకమైన మార్పు వస్తుంది; అంటే మరోవస్తువుగా అదిమార్పు చెందుతుంది.

• లెనిన్ : వర్క్స్. 38 వ సంపుటి, పుట 357 Marx - Engels - Marxism, Moscow, 1953, పుట 365)

• ఫ్రె. ఎంగెల్స్ : Anti - Duhring, Moscow, Foreign La nguages Publishing House, 1959, పుట 478.

భూగర్భచరిత్రయొక్క తృతీయయుగంలో నివసించిన జీవరాసులు అనేకవేల సంవత్సరాలు మార్పుచెందకుండా జీవించాయి. వాటిలో రూప భేదాలేవీ రాలేదు. అయితే, యీ స్థిరత్వం సాపేక్షమైనది. మారుతూవున్న పరిసరాలతో జరిగే ప్రతిస్పందన ఫలితంగా, జీవరాసుల్లో అనేకమార్పులు ఒక దానితర్వాత ఒకటి సంచితమవుతూ వచ్చాయి. కాలంగడిచేకొద్దీ ఈ మార్పులు అనువంశిక మయాయి. చివరకు పూర్తిగా కొత్తజాతియొక్క జంతువులు ఆవిర్భవించాయి. ప్రతిజాతిలోను అనువంశికత, భిన్నత్వం అనే రెండు విరుద్ధధోరణులమధ్య నిరంతరం జరిగే ప్రతిస్పందన, లేదా "ఘర్షణ" జీవకోటియొక్క పరిణామావికంతకూ అంతరంగికపునాది.

దీన్నుంచి బోధపడేది ఏమంటే, ఏదైనా ఒకవస్తువుయొక్క స్థిరావస్థ తాత్కాలికంగా మాత్రమే, సాపేక్షంగా మాత్రమే ఉండగల్గుతుంది. ఆ స్థిరావస్థ విరుద్ధశక్తులమధ్య కొంతసమతూకం, లేదా సమతాస్థితి (Equilibrium) ఉన్నప్పుడే సాధ్యం. పదార్థచలనం మాత్రమే శాశ్వతమైనదీ, పరమరూఢమైనదీను. పదార్థచలనమే పాతరూపాలను విసర్జిస్తూ కొత్తరూపాలను సృష్టిస్తుంది. గతితర్కంలోని యీ కీలక సూత్రాన్ని లెనిన్ యిలా వివరించాడు :

> "విరుద్ధశక్తులమధ్య ఐక్యత ఆగంతుకమైనది (Conditional); తాత్కాలికమైనది; చంచలమైనది; సాపేక్షమైనది. పరస్పర విరుద్ధ శక్తులమధ్య ఘర్షణ మాత్రం పరమ రూఢమైనది— అభివృద్ధీ, చలనం పరమ రూఢమైనట్లు."•

అభివృద్ధి అంటే అర్థం విరుద్ధశక్తులమధ్య ఐక్యత, ఘర్షణ అనే గతితార్కిక దృక్పథం అధిభౌతిక దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకమై

• లెనిన్ వర్క్సు : 38 వ సంపుటి, పుట 358 (Marx - Engels Marxism, Moscow 1953; పుట 338)

వట్టిది. అభివృద్ధిని గురించిన అధిభౌతిక దృక్పథంలో ఒక ప్రధాన లోపం ఏమంటే, అది పదార్థ గమనం యొక్క ఆంతరిక చోదకశక్తిని, స్వీయ చలనాన్ని విస్మరిస్తుంది; అభివృద్ధికి మూలం బాహ్యంలో ఉంటుందని చెబుతుంది. అంత్యపరిశీలనలో, భగవంతుడే యీ బాహ్య కారణం అవుతాడు. భగవంతుడు పదార్థానికి బయట ఉంటూనే, దానికి చలనం ప్రసాదిస్తాడు. ఈ విధంగా, అధిభౌతిక దృక్పథం అభివృద్ధిని గురించి పాక్షికమైన, అందువల్ల అపభ్రంశమైన అభిప్రాయాన్నివ్వడమే కాకుండా, ఈశ్వరవాదానికి కూడా దారితీసింది. ఆ విధంగా విజ్ఞానశాస్త్రానికి ద్రోహం చేసింది.

అభివృద్ధిని గురించిన గతితార్కికదృక్పథం ప్రగాఢమైనది; అర్థవంతమైనది. "లంఘనలకూ పరంపరలో విచ్ఛిన్నాలకూ, విరుద్ధశక్తులుగా మారడానికీ, పాతది నశించి కొత్తది ఉద్భవించడానికి కీలకం ఏమిటో అది తెలియజేస్తుంది." లెనిన్ ఈ దృక్పథాన్ని గురించి ఇలా వ్రాశాడు :

> "స్వీయచలనంయొక్క మూలకారణాన్ని గురించిన జ్ఞానంపైపు ఇది మనదృష్టిని మళ్లిస్తుంది." *

స్వీయచలనాన్ని గురించీ, అభివృద్ధిని గురించీ తెలుసుకోడానికి కీలకం సమస్తవస్తువులు, పరిణామాలు వైరుధ్యాలతో నిండివుంటాయని తెలుసుకోవడమేనని గతితర్కం బోధిస్తుంది. అందుచేత, అభివృద్ధిని గూర్చిన గతితార్కికదృక్పథం చలనానికి మూలకారణం ఏమిటో చెప్పేటందుకై లోకాతీతశక్తులకోసం వెతుక్కోనవసరం లేదు. ప్రకృతిలో "సర్వోత్కృష్ట"శక్తుల ప్రమేయాన్ని అది నిరాకరిస్తుంది. అందుచేత అది విజ్ఞానశాస్త్రానికి కట్టుబడివుంటుంది.

---

* లెనిన్ : వర్క్స్ - 38 వ సంపుటి, పుట 358 (Marx - Engels - Marxism, Mosccw 1953, పుట 333)

వైరుధ్యం ఎల్లప్పుడూ నిర్దిష్టమైనది

అభివృద్ధి అంటే విరుద్ధశక్తులమధ్య ఘర్షణ అనే పై వివరణ అత్యంతసాధారణమైనది. ఇది ప్రతి అభివృద్ధిక్రమానికీ వర్తిస్తుంది. అందుచేత ఏఒక్క అభివృద్ధిక్రమాన్ని వివరించడానికైనా యిదొక్కటే సరిపోదు. కారణమేమంటే, "సాధారణ" విరుద్ధశక్తులనేవి ఎక్కడా వుండవు; *విరుద్ధ శక్తులు ఎల్లప్పుడూ నిర్దిష్టమైనవిగా* (Concrete), *విశిష్టమైనవిగా* (Definite) వుంటాయి. ప్రతివస్తువులోను, పరిణామంలోను అసంఖ్యాకమైన పరస్పరవిరుద్ధ పార్శ్వా లుంటాయి. అంతేకాక, ప్రతిపరిణామం తన చుట్టూ వున్న వస్తువులతో, క్రమాలతో సంబంధం కలిగివుంటుంది. అందుచేతనే సమస్తపరిణామాల్లో అనేకరకాలైన బాహ్యవైరుధ్యాలూ, ఆంతరంగిక వైరుధ్యాలూ వుంటాయి. మనం ఒకపరిణామంయొక్క అభివృద్ధిని గురించి తెలుసుకోవాలంటే, ఒకానొక క్రమంలో ఏది ప్రధానమైన నిర్ణయాత్మకమైన వైరుధ్యమో తెలుసుకోవాలి; అందులో నిర్దిష్టమైన ఏవిరుద్ధశక్తులు ఘర్షణ పడుతున్నాయో, ఆఘర్షణ ఏరూపం ధరించిందో, వైరుధ్యంలోని ఏ పార్శ్వం ఏ విధమైనపాత్ర వహిస్తుందో కూడా తెలుసుకోవాలి.

ఒకానొక పరిణామంలోని సహజసిద్ధవైరుధ్యాలు మార్పుకు అతీతమైనవేమీ కావు; శాశ్వతమైనవి కావు. ప్రపంచంలో అన్నిటివలెనే అవి కూడా ఉద్భవించి, వృద్ధి చెంది, చివరకు పరిష్కారమవుతాయి. పాత గుణం పోయి, కొత్తగుణం వస్తుంది.

పరిణామక్రమాన్ని పరిశీలించేటప్పుడు ఘర్షణ పడుతున్న విరుద్ధ శక్తులు ఏ రూపాలు ధరించాయో, వృద్ధి చెందుతూన్న వైరుధ్యం ఏ యే దశలు దాటిందో నిర్దిష్టంగా అన్ని సందర్భాలలోను పరిశీలన జరపాలి.

పదార్థం తన అభివృద్ధి క్రమంలో - నిర్జీవ స్థితి నుంచి సజీవస్థితి ద్వారా మానవ సమాజం ఏర్పడ్డం–ఎంత ఉచ్చస్థితి నందుకొంటుందో అంత

క్లిష్టంగా, చిక్కులతో అభివృద్ధి క్రమం సాగుతుంది. ఈ క్రమంలో కొత్త పాతల వంటి విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ అంతకంతకు ఎక్కువ ప్రాముఖ్యం వహిస్తుంది. అభివృద్ధి చెందుతూన్న పరిణామంలో "విప్లవకర", "సాంప్రదాయిక" పార్శ్వాల మధ్య వ్యత్యాసమూ, విరుద్ధతా అంతకంతకు తీవ్రమౌతాయి. ఇక్కడ కూడ వైరుధ్యాలు పాత కొత్తల మధ్య ఘర్షణకు పరిమితం కావన్న విషయం నిజమే. కాని, అంత్యపరిశీలనలో, ఈ ఘర్షణే అభివృద్ధి యొక్క స్వభావాన్ని నిర్ణయిస్తుంది. అంటే, ఈ ఘర్షణ ఇలా జరుగుతున్నప్పుడు కొత్తశక్తి పాతశక్తి యొక్క ప్రతి ఘటనను నిర్మూలిస్తుంది; జీవితంలో తాను నిలదొక్కుకొంటుంది; పాతశక్తికి కాలంతీరడం వల్ల అది నశిస్తుంది.

అభివృద్ధిని గురించిన గతితార్కికసిద్ధాంతం ఒక్కొక్కపరిణామంలో వ్యక్తమయ్యే విరుద్ధధోరణులను నిర్దిష్టంగా పరిశీలించేవైపు పరిశోధకుడు తన దృష్టిని కేంద్రీకరించేటట్లు చేస్తుంది; నూతనశక్తుల్ని, వృద్ధిచెందే శక్తుల్ని, అభ్యుదయశక్తుల్ని క్రియారూపంలో బలపరచమని కోరుతుంది.

శత్రువైరుధ్యాలు, శత్రుత్వరహిత వైరుధ్యాలు

సామాజిక జీవితంలో శత్రు (Antagonistic) వైరుధ్యాలకు, శత్రుత్వరహిత (Non-antagonistic) వైరుధ్యాలకు మధ్య వ్యత్యాసం చూడ్డం ఎంతో ముఖ్యం.

ఏ సామాజికగ్రూపుల, లేదా వర్గాల ప్రధానప్రయోజనాలు సమన్వయపరచజాలనివో, ఆగ్రూపుల, లేదా వర్గాల మధ్యవైరుధ్యాలను శత్రువైరుధ్యాలని అంటాము. ఉదాహరణకు, పీడకులకూ పీడితులకూ మధ్య, దోపిడీదార్లకూ దోచుకోబడేవారికీ మధ్య వైరుధ్యాలు, మనకాలంలో కార్మికవర్గానికీ, పెట్టుబడిదార్లకూ మధ్య నున్నవైరుధ్యాలకు యిదిప్రధానంగా వర్తిస్తుంది. పెట్టుబడిదారీవర్గాన్ని శాంతియుతంగానో, బలప్రయోగంద్వారానో రద్దుచేసిన తరువాత

గాని ఈ శత్రువైరుధ్యాలు పోవు. అనగా. పెట్టుబడిదారీ వర్గానికి రాజకీయఅధికారం లేకుండాచేసి, ఉత్పత్తి సాధనాలన్నింటినీ ఆవర్గంనుంచి లాక్కొని. ఆ విధంగా కష్టజీవుల్ని దోచుకునేందుకు అవకాశం లేకుండాచేసినప్పుడే యీ వైరుధ్యాలు పోతాయి. ఇది సోషలిస్టు విప్లవంద్వారానే సాధ్యం.

రాజకీయాల్లోను, నిత్య జీవితంలోను దోపిడీ సమాజంలోని వర్గ వైరుధ్యాల స్వభావాన్ని—అంటే శత్రువైరుధ్యాలను—దృష్టిలోవుంచుకోడం చాల ముఖ్యం. దీన్ని కాదంటే, తప్పనిసరిగా సంస్కరణవాద పొరపాట్లు జరుగుతాయి. ఉదాహరణకు అవకాశవాదులు, రివిజనిస్టులు పెట్టుబడిదార్లకూ, కార్మికవర్గానికీ మధ్యనున్న వైరుధ్యాలు శత్రుస్వభావం గలవని గుర్తించరు. కనుకనే, వారు వర్గాలమధ్య సామరస్యాన్ని కోరుతారు. ఇట్టి విధానం తప్పు. దానివల్ల హానికలుగుతుంది. కార్మికవర్గంయొక్క స్థానాన్ని అది బలహీనపరుస్తుంది; శ్రామిక ప్రజలు తమ విముక్తికోసం జరిపే పోరాటాన్ని నిర్వీర్యమొనరుస్తుంది.

శత్రు వైరుధ్యాలు చారిత్రకంగా ఉత్పన్న మవుతాయి. వాటిని దోపిడీ సమాజం సృష్టించుతుంది; ఆ సమాజం వున్నంతకాలం అవికూడా వుంటాయి.

ఒకమనిషిని మరోమనిషి దోచుకొనేపద్ధతి అంతమైనప్పుడు శత్రు వైరుధ్యాలు కూడ నమసిపోతాయి. అయితే, దీనిఅర్థం సోషలిజంలో ఏవిధమైన వైరుధ్యాలూ ఉండవని కాదు. లెనిన్ ఇలా వ్రాశాడు :

"శత్రువైరుధ్యాలూ, వైరుధ్యాలూ ఎన్నటికీ ఒకటికావు. సోషలిజంలో శత్రువైరుధ్యాలు అంతమవుతాయి; వైరుధ్యాలు ఉంటాయి."†

వర్గవిభజనయొక్క అవశేషాలు నిర్మూలింపబడిన తర్వాత శత్రుత్వ

† Lenin : Miscellany XI, Moscow - Leningrad, 1931. పుట 357.

రహిత వైరుధ్యాలే ఉంటాయి. ఎందుచేతంటే, సమాజంలో వైరుధ్యాలు వర్గాలమధ్యనేకాక, సామాజిక జీవితంలో వివిధపార్శ్వాలమధ్య కూడా ఉత్పన్నమౌతాయి: ఉదాహరణకు, ఉత్పత్తికి వినిమయానికి మధ్య, ఆర్థిక వ్యవస్థలో వివిధరంగాలమధ్య, ఉత్పత్తిశక్తుల అభివృద్ధి అవసరాలకూ, ఆర్థిక నిర్వహణ రూపాలకూ మధ్య – ఇలాగే ఎన్నో వైరుధ్యాలు ఏర్పడుతాయి. కనుకనే జీవితంలో ఉత్పన్నమయే గతితార్కిక వైరుధ్యాలు అసాధారణ విషయాలేమీ కావు. తరచు వైరుధ్యాలవల్ల మనకు జీవితంలోను, పనిలోను, పోరాటంలోను అనేక ఆవేదనలు, యిబ్బందులు కలిగే మాట నిజమే. వాటిని అధిగమించడానికి శాయశక్తులా కృషిచేయాలి. ఐతే వైరుధ్యాలు లేకుండా, వాటిని పరిష్కరించడానికి పోరాడకుండా పురోగతి వుండదు.

సామాజిక వైరుధ్యాలన్నిటిలోను ప్రధానస్థానం వహించేది కొత్త వానికొరకు పోరాడేశక్తులకూ, పాతవానిని కాపాడేశక్తులకూ మధ్యనున్న వైరుధ్యాలు. కొత్తది జనించకుండా, అది తన జీవితంకోసం నిలబడకుండా, కొత్తదానికొరకు పోరాటం జరపకుండా అభివృద్ధి అసాధ్యమనే విషయం స్పష్టం. కొన్నిపరిణామాలు కొత్తగా తలఎత్తడం, మిగతావి పాతబడి పోవడం, వాటిమధ్య వైరుధ్యాలూ ఘర్షణలూ బయలుదేరడం, కొత్తది పాతదాన్ని జయించడం—ఇవన్నీ సామాజికాభివృద్ధియొక్క భౌతిక లక్షణాలు; క్రమబద్ధ లక్షణాలు.

"వైరుధ్యాలను పరిష్కరించేందుకు జరిగే పోరాటంలో ప్రజలు కాలంతీరిన వ్యవస్థలను, సంబంధాలను కూలద్రోస్తారు; విస్తృతను, చర్విత చర్వణపద్ధతులను విసర్జిస్తారు; కొత్తసమస్యలను, అదివరకటికంటె క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటారు; అదివరకటికంటె సమగ్రమైన సామాజిక జీవితరూపాలను ఎంచుకుంటారు.

సోషలిజంలో ఉత్పన్నమయే నిర్దిష్టమైన వైరుధ్యాలు ఎలాంటివి ? ఎన్. ఎస్. కృశ్చేవ్ ఈ విధంగా చెప్పాడు :

"ప్రధానంగా సోషలిస్టు ఆర్థికవ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందడంలో ఉత్పన్నమయ్యే వైరుధ్యాలు అవి; ప్రజల భౌతికావసరాల, సాంస్కృతికావసరాల అభివృద్ధికి సంబంధించిన వైరుధ్యాలవి; పాత కొత్తల మధ్య వైరుధ్యాలవి; పురోగమిస్తున్న, తిరోగమిస్తున్న శక్తుల మధ్య వైరుధ్యాలవి"†

సోషలిస్టు సమాజంలోని వైరుధ్యాలను శ్రామికప్రజలు మార్క్సిస్టు, లెనినిస్టుపార్టీ నాయకత్వం క్రింద పరిష్కరించుకొంటున్నారు; ఇందుకు వారు భౌతిక, సాంకేతిక వనరులను వేగంగా, నిర్విరామంగా అభివృద్ధి చేసుకుంటున్నారు; ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకుంటున్నారు. పరిపాలనాపద్ధతులను మెరుగుపరచుకోవడంద్వారా శ్రామికప్రజలలో సోషలిస్టు చైతన్యాన్ని వృద్ధిచేయడంద్వారా కూడ వారువైరుధ్యాలను పరిష్కరించుకొంటున్నారు. ఈ వైరుధ్యాలను పరిష్కరించుకోవడంవల్ల సోషలిస్టువ్యవస్థ మరింత పటిష్ఠమవుతుంది. కమ్యూనిజం వైపు సమాజం పురోగమిస్తుంది.

బూర్జువాసిద్ధాంతవేత్తలు గతితర్కాన్ని అపభ్రంశమొనర్చే తీరు

మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తున్న అనేకమంది సిద్ధాంతవేత్తలు గతితార్కిక భౌతికవాదాన్ని ఖండించే ప్రయత్నంలో, ప్రధానంగా గతితార్కిక వైరుధ్యసూత్రాన్ని విమర్శిస్తున్నారు. అసలు వాస్తవికతలో వైరుధ్యాలుండవనీ, ఆలోచనలో ఉండే తార్కిక అసంబద్ధత (Logical inconsistency) వల్లనే ఎల్లప్పుడూ వైరుధ్యాలు ఉత్పన్నమవుతాయనీ చాల తరచుగా వీరు వాదిస్తూవుంటారు.

---

† ఎన్. ఎస్. కృశ్చేవ్ : Forty years of The Great October Socialist Revolution. Report to The Jubilee Session of the Supreme Soviet of the U.S.S.R. on Nov. 6, 1957, Moscow, Foreign Languages Publishing House. పుట 35.

విరుద్ధశక్తులమధ్య ఐక్యత, ఘర్షణ అనే గతితార్కికసూత్రాన్ని ఖండిస్తూ చేసే ఈ "విమర్శ" పూర్తిగా నిరాధారమైనది. "వైరుధ్యాల"ను గురించి చెప్పేటప్పుడు, గతితార్కిక భౌతికవాదం ప్రధానంగా భౌతిక ప్రపంచంలో వుండేవైరుధ్యాలనే దృష్టిలో వుంచుకొంటుంది. వీటికీ, అపసవ్యమైన ఆలోచనవల్ల, తికమకభావాలవల్ల ఉత్పన్నమయే వైరుధ్యాలకూ గల తేడాను మనం గమనించాలి.

అపసవ్య ఆలోచనవల్ల కలిగే వైరుధ్యాలనూ, భౌతికవస్తువుల్లో ఉండే వైరుధ్యాలనూ మనం గందరగోళ పరచకూడదు; రెండు సందర్భాల్లోను "వైరుధ్యం" అనే మాట ఉన్నప్పటికీ. దానికి వేర్వేరు అర్థాలున్నాయి.

మార్క్సిజాన్ని వ్యతిరేకించేవారు మరొకపద్ధతి ద్వారా గతితార్కిక భౌతికవాదాన్నెదుర్కొంటున్నారు.

మొదటి ప్రపంచయుద్ధం తరువాత అనేక పెట్టుబడిదారీ దేశాల్లో నవ్య హెగెలియనిజం అనే అత్యంత అభివృద్ధినిరోధకమైన భావవాద ధోరణి తలెత్తింది. ఇప్పటికీ దాని పలుకుబడి పోలేదు. దాన్ని బల పరచేవారు హెగెల్ యొక్క భావవాద గతితర్కాన్ని అపభ్రంశ మొనర్చారు; అందులో నిజంగా విలువగల వాటన్నిటినీ తిరస్కరించారు. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని వ్యతిరేకించడానికీ, శాస్త్రవిరుద్ధమైన భావాలను, రాజకీయంగా అభివృద్ధినిరోధకమైన భావాలను కుతర్కంద్వారా • సమర్థించడానికీ దాన్ని ఉపయోగించ ప్రయత్నించారు.

ముఖ్యంగా కొందరు నవ్య హెగెలియన్లు జీవితస్వభావంలోనే శత్రు వైరుధ్యాలు. తీవ్ర సంఘర్షణలు, భయంకర విపత్తులు అనివార్యంగావుంటా

• కుతర్కం (Sophistry) : అపసవ్యవాదనలతో ఒక అసత్య సూత్రీకరణను సమర్థించే కళ.

యని వారుసూత్రీకరించారు; మానవజీవితాన్ని "భయంకర గతితర్కం" పరి పేష్టించి వుండడంచేత సమాజాన్ని పీడిస్తున్న శాశ్వత వైరుధ్యాలను ప్రజ లెన్నటికీ అధిగమించలేరనీ, తమ జీవితాలను హేతుబద్ధమైన, న్యాయమైన పునాదిమీద ఎన్నటికీ నిర్మించుకోలేరనీ వారు వాదించారు.

వైరుధ్యాలతో కూడుకొనివున్న పెట్టుబడిదారీవిధానాన్ని కూలద్రోసి సోషలిస్టువ్యవస్థను నిర్మించేందుకు కార్మికులు చేసేప్రయత్నం ఊహాజనిత మైన "అంత్యపరిణామవాదం"అనీ, సమాజంయొక్క గతితార్కిక అభివృద్ధి క్రమాన్ని అంతమొనర్చే ప్రయత్నమనీ వారు ఖండించారు.

బూర్జువాతత్వవేత్తలు వైరుధ్యాలను ఈ విధంగా వ్యాఖ్యానించడం ద్వారా, పెట్టుబడిదారీవిధానాన్ని పెంచిపోషించ జూస్తున్నారు. రెండోవైపు కార్మికవర్గం కమ్యూనిజంకొరకు జరిపేపోరాటాన్ని అప్రతిష్ఠపాల్జేయ దలచుకున్నారు.

నిజంచెప్పవలసివస్తే, సామాజికవైరుధ్యాలతోసహా అన్నివైరు ధ్యాలూ చివరకు పరిష్కారమైతీరుతాయి. సోవియట్ యూనియన్, తదితర దేశాల్లో సోషలిజం విజయం సాధించడాన్నిబట్టి, పెట్టుబడిదారీ విధానంలో స్వతస్సిద్ధంగా ఉండే వైరుధ్యాలు శాశ్వతమైనవి కావనీ, పెట్టుబడిదారీ విధానమే శాశ్వతమైనదికాదనీ, అందులోని వైరుధ్యాలను తప్పక తొలగించ వచ్చునవీ రుజువవుతోంది.

4. క్రిందిస్థాయినుంచి ఉన్నతస్థాయికి గతితార్కిక అభివృద్ధి.

భౌతికప్రపంచం శాశ్వతమైనది. అయితే, శాశ్వతమైన యీ పదార్థ జీవితం ఎల్లప్పుడూ మార్పుచెందే అనంతరూపాల్లో వ్యక్తమవుతుంది; అవి నిరంతరం ఆవిర్భవిస్తూ, వృద్ధిచెందుతూ, అంతర్ధానమవుతూ ఉంటాయి; పాతరూపాల స్థానే కొత్తరూపాలు బయల్దేరుతూ ఉంటాయి.

సువిశాలమైన యీ అనంతవిశ్వంలో నక్షత్రాలు ఉద్భవిస్తూ, నశిస్తూ ఉంటాయి. భూతలచరిత్రలో భూగర్భయుగాలు (Geological epochs) ఒకదాని తర్వాత ఒకటి వస్తూఉంటాయి. అసంఖ్యాకంగా పాత తరాలు నశించి కొత్తవి ఉద్భవించే యీ సుదీర్ఘ పరిణామక్రమంలో అనేక వృక్షజాతులు, జంతుజాతులు పరంపరగా పుట్టి నశిస్తున్నాయి. సామాజిక రూపాలు కూడా శాశ్వతంగా నిలవవు. అవి ఒకదానితర్వాత ఒకటి తలయెత్తి, వృద్ధిచెంది, బలపడి, తర్వాత క్షీణిస్తాయి; వాటిస్థానే కొత్తవి అవతరిస్తాయి. ఉదాహరణకు నేడు మన కళ్లయెదుట పెట్టుబడిదారీవిధానం స్థానే సోషలిస్టువ్యవస్థ రూపొందుతోంది.

నూతనరూపాలు ఒకదాని తర్వాత ఒకటి పరంపరగా పుట్టడంలో, పాతరూపాల స్థానే కొత్తరూపాలు నిరంతరం ఆవిర్భవించడంలో శాశ్వతమైన పదార్థ చలనం, అభివృద్ధి వ్యక్తమవుతాయి.

గతితార్కిక అభావం (Dialectial Negation)

హెగెల్ తన గతితార్కిక భావవాదాన్ని విశదీకరించడంలో "అభావం" (Negation) అనే ఒక భావనను ప్రవేశపెట్టాడు. పరమరూఢమైన భావం తార్కికంగా అభివృద్ధిచెందేక్రమంలో ఒకతత్వం (Category)† మరొక "తత్వాన్ని" అభావమొనర్చుతుందనీ. అయితే అందులో విలువగల దాన్నంతటినీ భద్రపరుస్తుందనీ చెప్పాడు. మార్క్సిస్టు గతితర్కంలో అభావమంటే అర్థం, ఒకపాతగుణం అభివృద్ధిచెందే క్రమంలో, నియమబద్ధంగా ఒక కొత్తగుణంవచ్చి దాని స్థానమాక్రమించడం. ఈ కొత్తగుణం

---

† తత్వం = Category. విల్సన్ రచించిన 'సాంఖ్యకారిక' లో యిలా వుంది : "There are 25 Tatwas, ie. physical and metaphysical categories. in the Sankhya system of philosophy. (బ్రౌన్ ఇంగ్లీషు-తెలుగు. నిఘంటువు)

పాతదానిలోనే ఆవిర్భవిస్తుంది. ఈ విధంగా. అభివృద్ధిక్రమంలో ఒక కొత్త గుణం పాతగుణం స్థానంలో ప్రవేశిస్తుందంటే, ప్రతివస్తువూ తరచు దాని విరుద్ధవస్తువుగా మారుతుందన్నమాట.

మార్క్సు యిలా వ్రాశాడు :

> "తనకు ముందున్న అస్తిత్వరూపాలను అభావమొనర్చనిదే ఏ రంగంలోనూ ఏ అభివృద్ధీ జరగదు." *

అభివృద్ధిక్రమంలో ఒకపాతగుణం స్థానాన్ని కొత్తగుణం ఆక్రమించడం విరుద్ధశక్తులమధ్య ఐక్యత, ఘర్షణ అనే నియమం అమలుజరగడంవల్ల కలిగే సహజఫలితం. ఎందుచేతంటే ప్రతివస్తువులోను, ప్రతిపరిణామంలోను, ప్రతిక్రమంలోను పరస్పరవిరుద్ధపార్శ్వాల ధోరణులమధ్య ఘర్షణజరుగుతూ వుంటుంది; చివరకు పాతది "అభావం" చెంది, కొత్తది తలఎత్తడానికి ఈ ఘర్షణ దారితీస్తుంది. ఐతే, ఒక పరిణామం స్థానే మరొక పరిణామం ఆవిర్భవించి, మొదటిదాన్ని "అభావం" చేసినంతమాత్రాన, అభివృద్ధి ఆగిపోదు. కొత్తగా తలఎత్తిన పరిణామంలో కొత్తవైరుధ్యాలుంటాయి. మొదట అవి కనబడకపోవచ్చు. కాని కాలంగడిచేకొద్దీ అవి బహిర్గతం కాకమానవు. అప్పుడు "విరుద్ధశక్తులమధ్య ఘర్షణ" ఒక నూతన ప్రాతిపదికపై జరుగుతుంది; ఉత్తరోత్తరా ఒక కొత్త "అభావానికి" అది అనివార్యంగా దారితీస్తుంది. భౌతికప్రపంచం మొత్తంమీద శాశ్వతమైనది, అనంతమైనదీను; కాని అందులోవుండే సమస్తవస్తువులూ స్థల కాలాలచేత పరిమితంచేయబడ్డాయి; అవి తాత్కాలికమైనట్టివి; "అభావ" మొనర్చబడేవి. ఏ "అభావమూ" ఆఖరుదికాదు. అభివృద్ధి ఎల్లప్పుడు సాగుతూనే వుంటుంది.

---

* కారల్ మార్క్సు : Die Moralisiereude Kritik und die Kritisiereude Moral, MEGA, 1. Abt. Bd. 6, Moscow-Leningrad, 1933. S. 303—304.

"అభావాల" పరంపరలో తలఎత్తే ప్రతి "అభావం" తిరిగి "అభావ" మొనర్చబడుతుంది.

గతితార్కిక భౌతికవాదం అన్నివిధాలైన అభావాన్ని గురించి ఆలోచించదు. గతితార్కిక "అభావాన్ని" గురించే అది ఆలోచిస్తుంది. అంటే, ఒకవస్తువు లేదా పరిణామం ఇంకా అభివృద్ధి చెందడాన్ని సూచించే అభావాన్ని గురించే ఆలోచిస్తుంది.

ఇట్టి గతితార్కిక "అభావానికీ" యాంత్రిక "అభావానికీ" తేడా వుంది. యాంత్రిక అభావంలో "అభావ" మొనర్చబడే వస్తువు బాహ్యశక్తియొక్క ప్రమేయంవల్ల నిర్మూలింపబడుతుంది. మన మొక కీటకాన్ని నులిమివేస్తే, లేదా ఒక గోధుమగింజను పిండిచేస్తే అది యాంత్రిక "అభావ" మౌతుంది. అది ఉద్దేశరహితంగా జరక్కపోవచ్చు (ఈ సందర్భంలో హానికరమైన కీటకాన్ని చంపడం, గోధుమగింజను పిండిగా మార్చడం). ఐనాసరే, అది ఆ వస్తువుయొక్క అభివృద్ధిని నిరోధిస్తుంది. ఎంగెల్సు యిలా వ్రాశాడు :

> "గతితర్కంలో అభావమంటే అర్థం, కేవలం లేదనడమేకాదు; ఫలానావస్తువు లేదని చెప్పడమేకాదు; తన కిష్టమైన విధంగా దాన్ని నిర్మూలించడమే కాదు." †

అభివృద్ధిలో అనవరత స్థితి (Continuity).

గతితార్కిక "అభావం" అంటే అర్థం. పాతవాటిని నాశనంచేయడమే కాదు. పాత అభివృద్ధిదశలలో వర్ధిల్లగలవాటిని పెంచి పోషించాలి. విస్తృమించే పాతవాటికీ, వాని స్థానంలో ప్రవేశించే కొత్తవాటికీ కొంతసంబంధం గతితార్కిక అభావంలో ఉంటుంది.

---

† ఎంగెల్సు : **Anti-Duhring, Moscow, Foreign Languages Publishing house, 1959. Page 194.**

పెట్టుబడిదారీసమాజంయొక్క శిథిలాలపై సోషలిస్టువ్యవస్థ నిర్మింపబడినపుడు, పెట్టుబడిదారీవిధానం "అభావ"మొనర్చబడ్డం అంటే అర్థం, ఆ విధానంలో మానవజాతి నిర్మించిన ప్రతిదాన్నీ పూర్తిగా నిర్మూలించడంకాదు; ఉత్పత్తిశక్తులు శాస్త్రీయనిజయాలు. సాంస్కృతికసంపద పెంచి పోషించబడతాయి; వాటి అభివృద్ధి కొనసాగుతుంది. పెట్టుబడిదారీవిధానం సృష్టించిన ప్రతి విలువగలఅంశాన్నీ శ్రామికవిప్లవం నాశనంచేయకుండా పెంచి పోషిస్తుంది. అంతేకాదు. ఆ అంశాలు మరింతపురోభివృద్ధికీ. సోషలిజం నిర్మాణానికీ ప్రాతిపదిక లవుతాయి.

పెట్టుబడిదారీవిధానంక్రింద సృష్టింపబడిన పాతసంస్కృతి సోషలిజానికి ఎంత ముఖ్యమో గ్రహించనివారిని లెనిన్ ఆక్షేపించాడు. నూతన సోషలిస్టుసంస్కృతిని శూన్యం నుంచి సృష్టించలేమని ఆయన చెప్పాడు. "ఇది ఎవరికీ తెలియని ప్రదేశంనుంచి ఉద్భవించినది కాదు.... పెట్టుబడిదారీ సమాజ శృంఖలాల్లో మానవజాతి సంపాదించి కూడబెట్టిన జ్ఞాననిధులన్నీ సహజసిద్ధంగా వృద్ధిచెందడంవల్లనే యిది లభించి వుండాలి."†

శూన్యవాదం (Nihilism), కేవల అభావం. పాతకొత్తలమధ్య ఉండే అవిరళ సంబంధాన్ని విస్మరించడం, పాత అభివృద్ధిదశలలో సాధింపబడిన వాటిని జాగ్రత్తగా కాపాడాలని గ్రహించకపోవడం—ఇవి సిద్ధాంతరీత్యా తప్పుధోరణులేకాక. ఆచరణలో తీవ్రమైన పొరపాట్లకు దారితీస్తాయి. లెనిన్ ఇలా వ్రాశాడు :

> "గతితర్కంలో ప్రధానంగా వుండేది కేవలం అభావంకోసం అభావంకాదు; కేవల అభావంకాదు; *సంశయాత్మక అభావంకాదు.* గతితర్కంలో నిస్సందేహంగా అభావం అనే అంశం ఉంటుంది: అది

---

† లెనిన్ : వర్క్సు, 31 వ సంపుటి, పుట 282 (The Tasks of the youth leagues, Moscow, 1951. పుట 11)

అత్యంతప్రధానమైన అంశం; అన్యోన్య సంబంధాన్ని తెలియజేసే అంశం; అభివృద్ధికి అవసరమయ్యే అంశం; అభివృద్ధికి దోహదమిచ్చే శక్తులను పెంచిపోషించే అంశం." *

కొత్తగుణం పాతగుణాన్ని "అభావ" మొనర్చడం వాస్తవికతను గురించిన సార్వత్రిక నియమం. "అభావం" నిర్దిష్టంగా ఎలా జరుగుతుంది? ఏ యే రూపాల్లో జరుగుతుంది? దాని స్వభావ మేమిటి ? ఇవి చాలా భిన్నంగా వుంటాయి. ఏ వస్తువు అభావ మొనర్చబడిందో ఆ వస్తువుయొక్క స్వభావాన్నిబట్టీ అందులోని వైరుధ్యాల స్వభావాన్ని బట్టీ. ఏ పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతుందో ఆ పరిస్థితుల్ని బట్టీ ఇవి ఆధారపడివుంటాయి. ఉదాహరణకు, ఏకకణజీవులు రెండేసి జీవులుగా విభజింపబడుతూ. సంఖ్యలో ఎక్కువ అవుతూ. అభివృద్ధి చెందుతాయి. బహుకణ జీవుల అభివృద్ధి ఇలా జరగదు. ప్రతి బహుకణ జీవీ కొత్త జీవుల్ని ఉత్పత్తిచేసి చనిపోతుంది ఏకకణజీవుల్లో జరిగే "అభావా"నికీ, బహుకణజీవుల్లో "అభావా"నికీ వ్యత్యాసం వుంది. నిర్జీవ ప్రపంచంలోను, మానవసమాజంయొక్క వివిధ అభివృద్ధిదశల్లోను కూడ "అభావం" విశిష్టమైన రూపాల్లో కొనసాగుతుంది.

అభ్యుదయస్వభావం గల అభివృద్ధి.

పాతబడిపోయినవి మాత్రమే అభివృద్ధిక్రమంలో "అభావ" మొనర్చబడతాయి గనుక. మంచివీ వర్ధిల్లగలవీ పెంచి పోషింపబడతాయి. కనుక అభివృద్ధి క్రిందిస్థాయినుంచి ఉన్నతస్థాయికి. సరళదశనుంచి క్లిష్టదశకు సాగుతుంది. అంటే. అభివృద్ధి అభ్యుదయకరంగా సాగుతుంది. మరోవిధంగా చెప్పాలంటే. అభివృద్ధి అనగా అభ్యుదయం.

తరచు ఈ అభివృద్ధిలో గడచిపోయిన దశలలాంటివి తిరిగి ప్రత్యక్షం కావచ్చు. కాలంతీరిన, "అభావ" మొనర్చబడిన రూపాలు, కొత్త

---

* లెనిన్ : వర్క్స్ - 38 వ సంపుటి, పుట 213-14.

రూపాల్లో పునర్దర్శనం కావచ్చు. ఎంగెల్సు ఈ సూత్రాన్ని వివరించేందుకు చాలామందికి తెలిసిన ఒక ఉదాహరణ చెప్పారు. ఆయన ఇలా వ్రాశారు :

"ఒక బార్లీ గింజను తీసుకుందాం. కోట్లసంఖ్యలో అలాంటి బార్లీ గింజలను మనం పిండిచేసి. ఉడికించి. పులియపెట్టి త్రాగుతాం. ఐతే. ఆ బార్లీ గింజే మామూలు పరిస్థితుల్లో ఉన్నప్పుడు, సరియైన నేలమీద పడినప్పుడు వేడివల్ల, తేమవల్ల ఒక నిర్దిష్టమైన మార్పుకు లోనౌతుంది; అందులో నుంచి మొలక బయలుదేరుతుంది అప్పుడు ఆ గింజ గింజగా ఉండదు. అంటే. అభావమొనర్చ బడుతుంది; దాని స్థానంలో మొక్క ప్రత్యక్ష మౌతుంది. ఈ మొక్క ఆ గింజనుంచి బయలుదేరినదే. కాని మొక్క జీవితం మామూలుగా ఏ క్రమంలో జరుగుతుంది? అది పెరిగి. పువ్వులు పూసి. కంకులు వేస్తుంది. చివరకు మళ్ళీ బార్లీ గింజలను తయారుచేస్తుంది. అవి పక్వానికి రాగానే. మొక్క చచ్చిపోతుంది. అంటే అది కూడా అభావమొనర్చ బడుతుంది. ఈ విధంగా. అభావాన్ని అభావమొనర్చడం వల్ల మనకు మళ్ళీ బార్లీ గింజలు లభించాయి. కాని ఒకేగింజ కాక పదిరెట్లు, ఇరవై రెట్లు, లేక ముప్పై రెట్లు గింజలు లభించాయి." †

కాయధాన్యాల జాతులు చాలనెమ్మదిగా గాని మారవు. నిజమే. కొత్త పంటలో లభించిన గింజకూ దానివిత్తనానికీ తేడా ఇంచుమించు వుండదు. ఐనప్పటికీ. మార్పు యింకా వేగంగా జరగడానికి మనంకొన్ని పరిస్థితులను సృష్టించవచ్చు. అప్పుడు "అభావంయొక్క అభావం" గుణాత్మకంగా మార్పుచెందుతుంది. ఉదాహరణకు, కొత్తరకమైన మరోబార్లీ మొక్క బయలుదేరుతుంది.

---

† ఫ్రె ఎంగెల్సు :**Anti-Duhring, Moscow, foreign Languages Publishing House, 1959.** పుట 186 - 187

ఐతే, పాతరోజులకు మనం తిరిగి వెళ్తున్నామా, అనిపించే క్రమాలు కూడా సమాజ చరిత్రలోను, జ్ఞానసంపాదన రంగంలోను మనకు కనిపిస్తాయి.

ఉదాహరణకు, ఆదిమకాల సమష్టి గణ జీవితంలో దోపిడీ అనేది వుండేదికాదు. చారిత్రకగమనంలో దానిస్థానే దోపిడీసమాజం రూపొందింది. (బానిస ఫ్యూడల్, లేక పెట్టుబడిదారీ సమాజం). కాని సోషలిజం అవతరించడంతో, ఒకమానవుని ఒకమానవుడు దోచుకొనే పద్ధతి రద్దయింది. ఈవిషంలో సోషలిస్టుసమాజం ఆదిమసమష్టి సమాజాన్ని పోలివుంటుంది. కాని, ఈ పోలికవెనుక ఒక పెద్ద వ్యత్యాసం, ప్రధానమైన వ్యత్యాసం దాగివుంది. అనేకవేల సంవత్సరాలలో సమాజం అభ్యుదయకరంగా అభివృద్ధి చెందుతూ వచ్చిన చరిత్ర దాగివుంది.

కాబట్టి. సామాజికాభివృద్ధి వర్తులాకారంలో (Circular) జరగడం లేదు. సరళరేఖవలె కూడ జరగడంలేదు. *శంఖావర్తక్రమంలో* (Spiral) జరుగుతూంది. సమాజం గతంయొక్క కొన్నిలక్షణాలను పునరుత్పత్తి చేసింది. కాని వాటిని అపారమైన ఉన్నతస్థాయిలో పునరుత్పత్తిచేసింది. అభివృద్ధిని గురించిన గతితార్కికదృక్పథంలోని ఈ ప్రధానలక్షణాన్ని లెనిన్ ఇలా వర్ణించాడు :

> "ఈ అభివృద్ధి పైకి పూర్వదశలనే పునరుక్తిచేస్తున్నట్లు కనిపిస్తుంది; కాని మరోవిధంగా వాటిని పునరుక్తిచేస్తూంది. అంతకంటే ఉన్నతమైన ప్రాతిపదికపై (అ భావంయొక్క అభావం) ఈ అభివృద్ధి సాగుతుంది ; సరళరేఖవలెకాక, శంఖావర్తక్రమంలో జరుగుతుంది." †

అభివృద్ధిక్రమంలో అభ్యుదయమార్గంనుంచి పెడత్రోవలు ఏర్పడ్డం కూడ సంభవమే ; అలా ఏర్పడుతూఉంటాయి కూడ. ఒక్కొక్కప్పుడు అభివృద్ధి వంకరటింకరమార్గాల్లో జరగవచ్చు: లేదా వెనక్కుతిరగనూవచ్చు :

† లెనిన్ : వర్క్సు, 21వ సంపుటి, పుట 38 (Marx - Engels - Marxism, Moscow 1951, పుట 26).

తాత్కాలికమైన ప్రతిష్టంభనదశలు కూడ రావచ్చు. ఐనప్పటికీ, ఉత్తరోత్తరా అభ్యుదయగమనం ఈ తాత్కాలిక పెడమార్గాలను, ఆటంకాలను అధిగమించి పురోగమిస్తుందని చరిత్ర రుజువుచేస్తోంది. ప్రస్తుతమున్న ప్రకృతిరూపాలన్నిటికీ, సామాజికరూపాలన్నిటికీ పెద్దచరిత్ర వుంది. అది అతిప్రాచీనమైన కాలందాకా విస్తరించింది. అది ఒకసుదీర్ఘ అభివృద్ధిక్రమం యొక్క ఫలితం: సరళదశనుంచి క్లిష్టదశకు సాగిన అభ్యుదయగమనం యొక్క ఫలితం; క్రిందిస్థితి నుంచి పైస్థితికి ఆరోహించే క్రమంయొక్క ఫలితం.

సౌరకుటుంబం కాస్మిక్ ధూళినుంచి రూపం ధరించింది. ఈనాటి మొక్కలు జంతుజాలం అత్యంత ప్రాథమికమైన ప్రాణుల్లోనుంచి వృద్ధి చెందాయి. మానవసమాజం ఆదిమతెగల దశనుంచి సమకాలీన జీవితరూపాలకు చేరుకోవడానికి చాలా దీర్ఘప్రయాణం చేసింది. సాంకేతిక శాస్త్రం ఆదిమపనిముట్ల దశనుంచి అతి జటిలమైన యాంత్రిక చలన రూపాలకు పురోగమించింది. ప్రాచీన తాత్వికులు ప్రపంచాన్ని గురించి అనేకభ్రాంతులతో కూడిన ఊహలెన్నో చేశారు. మానవుని జ్ఞానం ఆ దశనుంచి వాస్తవికతకు సంబంధించిన అన్ని రంగాలను పరివేష్టించే విజ్ఞానశాస్త్రాల సంశ్లిష్ట వ్యవస్థకు చేరుకొంది.

ఈవిధంగా ప్రకృతి, సమాజం, మానవ ఆలోచన అంతకంతకు అభివృద్ధిచెందుతున్నాయనే విషయాన్ని నిరూపించడంద్వారా. గతితార్కిక భౌతికవాదం ప్రజలకు శాస్త్రీయ ఆధారం గల. చారిత్రక ఆధారం గల దృఢవిశ్వాసాన్ని కలిగిస్తోంది; నూతనమైన. ఉన్నతమైన జీవితంకొరకు, అట్టి సమాజ నిర్మాణంకొరకు ప్రజలు సాగిస్తున్న పోరాటానికి సహాయ పడుతోంది.

౩. ప్రపంచాన్ని తెలుసుకొనేందుకు, మార్చేందుకు గతితర్కం ఒక పద్ధతి

భౌతికవాద గతితర్కం ప్రకృతి, సమాజం, ఆలోచన వీటికి సంబంధించిన అతి సాధారణమైన అభివృద్ధి సూత్రాలను వెల్లడించడం ద్వారా, వాస్తవ ప్రపంచాన్ని తెలుసుకొనేటందుకూ, ఆ జ్ఞానం ఆధారంపై దాన్ని మార్చేటందుకూ ఒక శాస్త్రీయపద్ధతిని ప్రసాదించింది.

విజ్ఞానశాస్త్రానికీ, కార్యాచరణకూ గతితర్కంయొక్క ప్రాధాన్యం

గతితార్కిక నియమాలు సార్వత్రికస్వభావం గలవి. అందుచేత అవి వైధానిక (Methodological) ప్రాధాన్యం కలిగివున్నాయి. పరిశోధనకవి కరదీపికలు; జ్ఞానసంపాదన పథంలో అవి మార్గదర్శకాలు.

నిజం చెప్పాలంటే, ప్రపంచంలో ప్రతీది గతితార్కిక నియమాల ననుసరించి జరుగుతూండడంవల్ల, ప్రతిపరిణామాన్నీ తెలుసుకొనేందుకై మనం గతితార్కిక దృక్పథమే అవలంబించాలి. అభివృద్ధి ఎలా జరుగుతుందో తెలుసుకోగల్గినప్పుడు, అభివృద్ధిచెందుతున్న వాస్తవికతనెలా పరిశోధించాలో, దాన్ని మార్చేటందు కేమిచేయాలో కూడా బోధపడుతుంది. గతితర్కం విజ్ఞానశాస్త్రానికీ, ప్రపంచాన్నిమార్చేకృషికీ ఎంతో ప్రాధాన్యం వహిస్తూందంటే కారణం యిదే.

భౌతికవాదగతితర్కం విజ్ఞాన శాస్త్రాల స్థానమాక్రమించ జాలదనే మాట నిజమే. వాటి ప్రత్యేకసమస్యలను, విధులను అది పరిష్కరించలేదు. ఐనప్పటికీ, ప్రతి శాస్త్రీయసిద్ధాంతం భౌతికప్రపంచంయొక్క ప్రతిబింబమే; అనుభవానికి సంబంధించిన వాస్తవాల వివరణమే; వాటి సామాన్యీకరణమే. అందుకు శాస్త్రవేత్తలు సార్వత్రికభావనలను ఉపయోగించవలసియుంటుంది

అలా ఉపయోగించడం ఒక కళ. ఆ కళను గతితర్కం బోధిస్తుంది. గతితర్కమంటే ఏమిటో తెలియని శాస్త్రవేత్త, తాను పరిశీలిస్తున్న విషయానికి సంబంధించిన వాస్తవ విషయాలలో ఉండే తార్కిక క్రమాన్ని అర్థంచేసుకొని, తద్వారా సరియైన నిర్ణయాలకు రాగలడనే మాట నిజమే. అయితే, అతడు చైతన్యయుతంగా గతితర్కపద్ధతిని అనుసరించడం వల్ల అతనికి అమూల్యమైన సహాయం లభిస్తుంది; అతని కృషికి అదెంతో సాయపడుతుంది.

గతితార్కిక భౌతికవాద సూత్రాలు, నియమాలు ఏ ఒక్క విజ్ఞాన శాస్త్రం సమకూర్చిన సమాచారం నుంచీ ఉత్పన్నంకాలేదు. ప్రపంచాన్ని గురించిన జ్ఞానసంపాదనక్రమం యొక్క చరిత్ర అంతటినీ సామాన్యీకరించిన ఫలితం అది. శాస్త్రవేత్త గతితర్కాన్ని గురించి తెలుసుకొని వున్నట్లయితే, తన శాస్త్రానికి సంబంధించిన సమస్యలను పరిశీలించేటప్పుడతడు అత్యున్నతమైన శాస్త్రీయవిధానం చేబట్టగల్గుతాడు; మహోన్నతమైన శాస్త్రీయ ప్రపంచదృక్పథాన్ని ఏర్పరచుకోగల్గుతాడు. సమస్తశాస్త్రాలయొక్క, సాంఘికాచరణయొక్క సామాన్యీకృత అనుభవం సాయంతో అతడు తన ప్రత్యేక శాస్త్రంపై పరిశోధనలు జరపగల్గుతాడు.

గతితర్కాన్ని వాస్తవ విషయాల, వాటి నియమాల పరిశీలనపై కేంద్రీకరిస్తే, మన దృష్టినది నిశిత మొనర్చుతుంది. శాస్త్రజ్ఞుల, రాజకీయవేత్తల, సాంకేతికనిపుణుల, విద్యాకోవిదుల, కళాకారుల మనస్సుల్ని అది వికసింపజేస్తుంది; నూతన పరిణామాలయెడ యుక్తియుక్త (Flexible) వైఖరిని, గ్రాహ్యశక్తిని (Receptivity) కలిగిస్తుంది. వారికి ప్రాణవాయువెంత అవసరమో యిదికూడా అంత అవసరం. ఆలోచనను స్తంభింపజేసి శాస్త్రాభివృద్ధిని అరికట్టే పిడివాదం, దురభిప్రాయాలు, ముందే ఏర్పరచుకున్న నిర్ధారణలు, అవాస్తవమైన "శాశ్వత సత్యాలు" - వీటిని గతితర్కం నిర్మూలిస్తుంది. జీవితంతో నిత్యసంబంధం కలిగివుండాలనీ,

గతంలో కూరుకుపోకూడదనీ గతితర్కం బోధిస్తుంది. కొత్తను గ్రహించాలనీ, ఎల్లప్పుడూ పురోగమిస్తూనే ఉండాలనీ బోధిస్తుంది.

గతితర్కం శాస్త్రపరిశోధనయొక్క మూలతత్వాన్ని (Spirit) వ్యక్తంచేస్తుంది. అంటే, మనం సంపాదించే జ్ఞానంపట్ల నిత్య అసంతృప్తి, నిజం తెలుసుకోడానికి నిరంతరవ్యధ. వాస్తవికతను గురించిన జ్ఞానాన్ని ఏకతెగకుండా ప్రగాఢ మొనరించుకోవాలనే పట్టుదల—వీటిని గతితర్కం కలుగజేస్తుంది.

గతితర్కం స్వీయాత్మకదృష్టిని, సంకుచితత్వాన్ని, పాక్షికతను దూరంగా ఉంచుతుంది; ప్రపంచాన్ని గురించి విశాలదృక్పథ మలవరచుతుంది; ఏ విషయాల్ని మనం పరిశీలిస్తున్నామో వాటియెడ సమగ్రదృష్టిని ప్రోత్సహిస్తుంది. సమస్తవస్తువుల్ని నిష్పాక్షికంగా అన్నిదృక్కోణాలనుంచి పరిశీలించాలనీ, వాటి చలనాన్ని అభివృద్ధిని గమనించాలనీ. వాటిఅన్యోన్య సంబంధాలను అంతర్దశలను గుర్తించాలనీ, పరస్పర పరివర్తనలను కనిపెట్టాలనీ బోధిస్తుంది ప్రతి పరిశీలకుడు బాహ్యాన్నేకాక అంతరాన్నికూడ చూడాలనీ, ప్రతిపరిణామంయొక్క సారాన్నేకాక రూపాన్నికూడ దృష్టిలో ఉంచుకోవాలనీ పైపై వర్ణనలతో ఆగక లోతుకుపోయి ఆంతర్యాన్ని గ్రహించాలనీ, అయితే బాహ్యం కూడ ముఖ్యమే గనుక దాన్ని నిర్లక్ష్యం చేయకూడదనీ గతితర్కం బోధిస్తుంది. అభివృద్ధిచెందే ప్రతి పరిణామంలోని విరుద్ధధోరణుల్ని అది మన దృష్టికి తెస్తుంది. పరివర్తనచెందుతున్న వాటిలో ఏది స్థిరంగా ఉండేదో చూపుతుంది; పైకి మారనట్లు కనిపించేవానిలో ముందు ముందు జరిగే మార్పుల్ని బీజరూపంలో కనిపెట్టగలుగుతుంది.

గతితర్కాన్ని గురించి లెనిన్ యిలా వ్రాశారు :

"అది సజీవమైన, బహుముఖమైన జ్ఞానం (ఆ ముఖాలు నిరం

తరం మారుతూవుంటాయి.) వాస్తవికతను అది రకరకాలైన దృక్పథాల నుంచి, అనంతమైన ఛాయల్లో చూస్తుంది." *

గతితర్కాన్ని అధ్యయనం చేయడం, దాన్ని అన్వయించడం ఒక బలమైన బోధనాపద్ధతి. గతితర్కం ఒక ప్రత్యేకమైన ఆలోచనారీతిని, ఒక ప్రత్యేకమైన కార్యశైలిని (Style in work) పెంపొందిస్తుంది. ఇవి స్వీయాత్మకతకు, విస్తబ్ధతకు, పిడివాదానికి బద్ధశత్రువులు ; కొత్తదనాన్నీ, అభివృద్ధినీ, అభ్యుదయాన్నీ యివి ఆహ్వానిస్తాయి.

గతితర్కం మార్క్సిజానికి నిజమైన అంతరాత్మ. భౌతికవాద గతితర్కాన్ని అధ్యయనం చేయడంవల్ల లాభపడేది శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులే కాదు. మనచుట్టూ జరిగే పరిణామాలనుగురించి కూలంకషంగా జ్ఞానం సంపాదించదలచుకున్న వారందరికీ, సామాజిక జీవితంలో చైతన్యయుతంగా పాల్గొనదలచుకొన్న వారందరికీ యిది సహాయకారిగా ఉంటుంది.

విజ్ఞానశాస్త్రం, సామాజికజీవితం అభివృద్ధిచెందుతూండడం చూచి, అభ్యుదయకాముక శాస్త్రజ్ఞులు విజ్ఞాన శాస్త్రానికీ, సమాజానికీ గతితర్కం ఎంత ప్రాధాన్యం వహిస్తుందో అంతకంతకు అధికంగా తెలుసుకో నారంభించారు. దానిపట్ల తమకుంటూ వచ్చిన దురభిప్రాయాలను వదులుకొంటున్నారు.

గతితర్కాన్ని సృజనాత్మకంగా అన్వయించవలసిన అవసరం.

గతితర్కాన్ని విజ్ఞానశాస్త్రానికీ, నిత్యజీవితానికీ సరిగా అన్వయించడమంటే సులభమైన విషయం కాదు; గతితర్కం శాస్త్రీయసమస్య లన్నిటికీ,

---

* లెనిన్ : వర్క్స్, 38 వ సంపుటి, పుట 360 (Marx - Engels-Marxism, Moscow 1951, పుట 309 - 10).

జీవిత సమస్యలన్నిటికీ సూటియైన సమాధానా లిచ్చే 'గైడ్'వంటిపుస్తకమేమీ కాదు. ఆచరణ కది సజీవమైన, యుక్తియుక్తమైన మార్గదర్శి; జీవితాన్నీ, జీవిత ధోరణుల్నీ అది గ్రహిస్తుంది.

గతితార్కిక సూత్రాలను, నియమాలను సిద్ధపరచిన ఒక సమూనాగా పరిగణించకూడదు; వాస్తవికతకు సంబంధించిన విషయాలన్నిటినీ మన ఇష్టంవచ్చినట్లు అందులో "ఇమడ్చ"వచ్చుననుకో కూడదు. ఆవిధమైన దృక్పథం అవాస్తవికమయినది, డాంబికమయినది. పిడివాదంతో కూడినదీను.

గతితార్కిక నియమాలు సార్వత్రికమైనవి. అవి సమస్త వస్తువులకు, పరిణామాలకు వర్తిస్తాయి. అయితే, భౌతిక ప్రపంచానికి సంబంధించిన వివిధరంగాల్లో, గుణాత్మకంగా భిన్నమైన పరిణామక్రమాల్లో అవి వేర్వేరుగా పనిచేస్తాయి. నిర్జీవప్రపంచంలో ఒక రూపంలోను, సజీవ ప్రపంచంలో యింకొక రూపంలోను అవి వ్యక్తమవుతాయి. వాటి స్వభావం సమాజాభివృద్ధిలో ఒక విధంగాను, జీవరాసుల పరిణామక్రమంలో యింకొక విధంగాను ఉంటుంది. సోషలిస్టు సమాజంలో ఒకవిధంగా, పెట్టుబడిదారీ సమాజంలో వేరొక విధంగా అవి పనిచేస్తాయి.

గతితర్కాన్ని జ్ఞాన సంపాదన క్రియలోను, జీవిత కార్యాల్లోను వర్తింప జేయాలంటే, గతితార్కిక సూత్రాల్లో ప్రావీణ్యం సంపాదించడ మొక్కటే చాలదు; నిర్దిష్ట విషయాలను గురించీ, పరిస్థితుల్ని గురించీ లోతైన పరిజ్ఞానం ఉండాలి. ప్రతి నిర్దిష్ట పరిస్థితినీ అతి జాగ్రత్తగా, కూలంకషంగా పరిశీలించిన తర్వాతే, గతితార్కిక నియమాలు ఒకానొక పరిస్థితిలో ఏ విధంగా ఏరూపంలో వర్తిస్తాయో, ఆ పరిస్థితి నెలా అంచనాకట్టాలో, ఏ కార్యవిధానం అవలంబిస్తే జయిస్తామో కనిపెట్టగలుగుతాం. అందుచేతనే, *గతితర్కాన్ని ఎల్లప్పుడూ సృజనాత్మకంగా వర్తింపజేయ వలసి యుంటుంది.*

గతితార్కిక భౌతికవాద పద్ధతి నెలా ఉపయోగించాలో తెలుసుకోవాలంటే, మార్క్సిజం-లెనినిజం స్థాపకులైన మార్క్సు, ఎంగెల్సు, లెనిన్ లు వ్రాసిన గ్రంథాల్లోని, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ తదితర కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల నిర్ణయాలు- కార్యకలాపాల్లోని చక్కని ఉదాహరణలను గమనించాలి.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ, తదితర మార్క్సిస్టు పార్టీలు గొప్ప గొప్ప విజయాలు సాధించడానికి ఒక ప్రధానకారణ మేమంటే, ఆపార్టీలు తమ విధానా లన్నిటిలోను, కార్యకలాపా లన్నిటిలోను భౌతికవాద గతితర్కపద్ధతి ననుసరించాయి; ఆ పద్ధతిని సృజనాత్మకంగా అభివృద్ధిచేశాయి. గతితార్కిక భౌతికవాదంనుంచి పెడమార్గ మవలంబిస్తే, దాని సూత్రాలను, నియమాలను నిర్లక్ష్యం చేస్తే, అంత్య పరిశీలనలో సిద్ధాంత పరిశీలనల్లోనే కాక, ఆచరణాత్మక కృషిలో కూడ వైఫల్యాలు సంభవిస్తాయి. మాస్కోలో 1957 నవంబరు 14 నుండి 16 వరకు జరిగిన సోషలిస్టుదేశాల కమ్యూనిస్టు-వర్కర్సు పార్టీల సమావేశం తన ప్రకటనలో యిలా తెలియ జేసింది :

"మార్క్సిస్టు రాజకీయపార్టీ వివిధ సమస్యలను పరిశీలించేటప్పుడు గతితర్కంమీద, భౌతికవాదంమీద ఆధారపడకపోతే కలిగే ఫలితాలు పాక్షికదృక్పథం, స్వీయాత్మకధోరణి, ఆలోచన స్తంభించడం, జీవితంనుంచి దూరమవడం, వివిధ వస్తువుల్నీ, పరిణామాల్నీ సరిగా పరిశీలించ లేకపోవడం, రివిజనిస్టు తప్పులు, పిడివాదపొరబాట్లు, విధానాల్లో లోపాలూను." †

---

† Declaration of the Meeting of Representatives of the Communist and Workers' parties of the Socialist Countries held in Moscow, Nov 14 to 16, 1957. Peace Manifesto, Moscow. Foreign Languages Publishing House, 1957 Page 17.

గతితర్కం వాస్తవికతను పరిశీలించే పద్ధతిమాత్రమే కాదు. వాస్తవికతను విప్లవాత్మకంగా మార్చేపద్ధతికూడా అది. మన చుట్టూవున్న ప్రపంచాన్ని గురించి క్రియాత్మకమైన, శక్తివంతమైన దృక్పథం అవలంబించవలసిన అవసరాన్ని అది నొక్కిచెబుతుంది. భౌతికవాద గతితర్క సూత్రాలు. నియమాలు ఆచరణలోనే - అనగా శ్రమ పని, వర్గపోరాటం, కమ్యూనిజం నిర్మాణం వగైరా—పరీక్షింపబడతాయి. గతితర్కాన్ని మరింతగా అభివృద్ధిచేయడానికి, దాని సూత్రాలను మరింతగా విశదీకరించడానికి, దాని నియమాలను మరింత సమగ్రంగా, ప్రగాఢంగా అధ్యయనం చేయడానికి ఆచరణ మనకు పుష్కలమైన సమాచారాన్నిస్తుంది. అందువల్లనే, మార్క్సిస్టు గతితర్కాన్ని సృజనాత్మకంగా అన్వయించాలంటే, మొట్ట మొదటి విషయం. ఆచరణకు సంబంధించిన కృషిలో, జీవితాన్ని మార్పు చేసే కృషిలో దాన్నొక సాధనంగా ఉపయోగించాలి.

మూడవ అధ్యాయం

జ్ఞానసిద్ధాంతం

మానవుడు తనచుట్టూవున్న ప్రపంచాన్ని గురించి సంపాదించిన జ్ఞానం ఒక్కరోజులో లభించిందికాదు; దానికి పెద్దచరిత్ర ఉంది. అజ్ఞానం నుంచి జ్ఞానానికి. అసంపూర్ణ అపరిపక్వ జ్ఞానంనుంచి సంపూర్ణ పరిపక్వ జ్ఞానానికి మెట్టుమెట్టుగా మానవుడు పురోగమించాడు. ఈ పరిణామ క్రమం యొక్క లక్షణాలను నియమాలను తెలియజేసేదే మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం.

జ్ఞానసూత్రాలను అర్థంచేసుకోవాలంటే, జ్ఞానాన్ని మనం అభివృద్ధి క్రమంలో తెలుసుకోవాలి: ఏవిధంగా అది ఆవిర్భవిస్తుందో, దాని అంత రంగిక వైరుధ్యాలమధ్య ఏవిధమైన ఘర్షణ జరుగుతుందో పరిశీలించాలి. అన్ని అభివృద్ధి క్రమాలవలెనే జ్ఞానసంపాదనక్రమం కూడా సార్వత్రికమైన భౌతికవాద గతితర్క నియమాలచే నిర్ధారితమవుతుంది. జ్ఞానానికి సంబం ధించిన మార్క్సిస్టు సిద్ధాంతమే గతితర్కమని లెనిన్ వ్రాశాడు. మార్క్సి స్టులు జ్ఞానానికి సంబంధించిన సమస్యలపట్ల గతితార్కిక దృక్పథమవలం బిస్తారు. మార్క్సిస్టుల జ్ఞానసిద్ధాంతానికీ, మార్క్సుకు పూర్వం భౌతికవాదులు రూపొందించిన సిద్ధాంతాలకూ భేదం యిదే.

1. జ్ఞానానికి ప్రాతిపదిక, పరమార్థం ఆచరణ

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించి తెలుసుకోడం - ఎంతో దూరాన వున్న నక్షత్రకూటాలను గురించీ, సూక్ష్మకణాలను గురించీ పరిశీలనలు జరపడం, భూమిమీద ప్రాణం యెలా ఏర్పడిందో తెలుసుకోవడం, ప్రాచీన నాగరికతల చరిత్రను పరిశోధించడం క్లిష్టమైన గణితశాస్త్ర సమస్యలను పరిష్కరించడం, విశ్వ వికిరణను (Cosmic radiation) విశ్లేషించడం - మొదలైనవన్నీ మరులుగొల్పే కార్యకలాపాలు. ఇవి పరిశోధకునికి గొప్ప సంతృప్తిని కలిగిస్తాయి; తరచు యీ కృషి అతని జీవితానికే పరమావధి. అయితే, విజ్ఞానశాస్త్రాన్నెవరూ సరదాకి స్వీకరించరు. మానవుని నిత్యకృత్యాల్లోను, ప్రకృతిపై అతడు పోరాటం జరపడంలోను, సామాజిక కార్యాల్లోను, అంటే వ్యక్తియొక్క సమాజంయొక్క జీవితం దేనిమీద ఆధారపడివుంటుందో ఆ కార్యకలాపా లన్నిటిలోను, జ్ఞానం మానవునికి బ్రహ్మాండమైన శక్తి నిస్తుంది.

భావవాదులు తరచు జ్ఞానానికీ ఆచరణకు సంబంధించిన కార్యాలకూ పోటీపెట్టజూచారు; జ్ఞానాన్ని ఆచరణనుంచి వేరుచేయ యత్నించారు. మానవుని ఆత్మ ఎల్లప్పుడూ సత్యాన్నిగురించి తెలుసుకోడానికి చేసే కృషిఫలితమే జ్ఞానమనీ, అది ఆచరణమీద ఆధారపడదనే అభిప్రాయం నుంచి వారు బయల్దేరుతారు. లేదా, జీవితకార్యాలకూ జ్ఞానానికీ సంబంధం వుండదనీ, మానవునిబుద్ధి సకలపదార్థాలమీద ఆధిపత్యం సంపాదించి విజయాలమీద విజయాలు సాధించడానికే ఉద్దేశింపబడిందనీ, ప్రపంచాన్ని గురించి నిజమైనజ్ఞానం సంపాదించడం అసాధ్యం (ఫ్రెడరిక్ నీట్షే మొదలైనవారి అభిప్రాయం), లేదా ఇంద్రియాతీతమైన దివ్యదృష్టి

(Intuition) * వల్లనే సాధ్యం (హెన్రీ బెర్గసన్ అభిప్రాయం) అనే అభిప్రాయాలనుంచి వీరు బయల్దేరుతారు.

ఈ రెండు అభిప్రాయాలూ కూడ జ్ఞానానికీ కర్మకూ, సిద్ధాంతానికీ ఆచరణకూ గల అసలు సంబంధాన్ని అపభ్రంశ మొనర్చుతున్నాయి.

విజ్ఞానశాస్త్రాల పుట్టుకకు, అభివృద్ధికి సంబంధించిన చరిత్ర మనకు బోధించేది ఏమంటే. సర్వసాధారణంగా శాస్త్రాలూ, జ్ఞానం ఆచరణకు సంబంధించిన అవసరాలనుంచే ఉత్పన్నమవుతాయి; ఆచరణే జ్ఞానానికి అవశ్య విషయం, ఆధారమూను.

మానవుడు ఆచరణకు సంబంధించిన కార్యకలాపాల్లో తనచుట్టూ ఉన్న ప్రపంచంతో ప్రత్యక్షసంపర్కమేర్పరచుకొంటాడు. సకలవస్తువులు, పదార్థాలు మానవుని క్రియాత్మకచర్యలకు లోనై మార్పుచెందుతూండడం వల్ల. అంతకుముందెవరికీ తెలియని వాటిధర్మాలు మానవునికి అవగతమవుతున్నాయి. ఏదైనా ఒకవస్తువును మనం ఉపయోగిస్తున్నామంటే, దాన్ని గురించిన జ్ఞానంకూడ మనకు అదేసమయంలో లభిస్తుంది; ఆచరణ అభివృద్ధి చెందేకొద్దీ దాని వైవిధ్యం పెరిగేకొద్దీ జ్ఞానసంపాదనకు గల అవకాశాలు విస్తృతమవుతాయి.

అత్యంత భావనాత్మకమైన శాస్త్రాలతోసహా, సకలవిజ్ఞాన శాస్త్రాలు మానవుని ఆచరణాత్మక అవసరాల కనుగుణంగా ఉత్పన్నమైనవే. రేఖాగణితం మొదట్లో భూమియొక్క కొలతలతో సంబంధం కలిగి ఉండదని దానిపేరువల్లనే తెలుసుకోవచ్చు. • ఖగోళశాస్త్రం నౌకాయానంతోను వ్యవ

---

* భావవాద తత్వశాస్త్రం ప్రకారం, దివ్యదృష్టి అనగా, శాస్త్రీయ అనుభవం లేదా హేతువాదం యొక్క సహాయం లేకుండానే, "సత్యాలను" "అప్పటికప్పుడు" ఇంద్రియాల కతీతమైన జ్ఞానంద్వారా తెలుసుకోవడం.

• జామెట్రీ (రేఖాగణితం) అనే ఇంగ్లీషుమాట రెండు గ్రీకుమాటల సంయోగం, వాటిఅర్థం భూమిని కొలవడం.

సాయ ప్రక్రియలతోను, పంచాంగాల రచనతోను సంబంధం కలిగివుండేది. యాంత్రికశాస్త్రం వాస్తుకళతోను, కోటలనిర్మాణం మొదలైనవాటితోను సంబంధం కలిగిఉండేది.

జ్ఞానం ఆచరణమీద ఆధారపడి ఉంటుందని మనం ప్రాచీన చరిత్ర నుంచి గ్రహించిన విషయమే కాదు. పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించి, పరిశ్రమలు శరవేగంతో అభివృద్ధిచెంద నారంభించినప్పుడు ప్రకృతిశాస్త్రం వేగంగా పురోగమించసాగింది. ప్రస్తుతకాలంలో కూడా విజ్ఞానశాస్త్రం నిత్యజీవితంతో పెనవేసుకొని ఉంది. దాని భావనాత్మక, సిద్ధాంత శాఖలకు సంబంధించినంతవరకు వాటి సంబంధం యిదివరకుకంటె క్లిష్టంగా, పరోక్షంగా ఉన్నప్పటికీ, ఆచరణ ఎప్పటివలెనే జ్ఞానానికి మూలాధారంగా ప్రేరణశక్తిగా, చోదకశక్తిగా ఉంది.

మార్క్సుకు పూర్వం భౌతికవాదం జ్ఞానానికీ, ఆచరణకూ గల సంబంధాన్ని కనిపెట్టలేకపోయింది. ఇది దాని ప్రధానలోపాల్లో ఒకటి. తరచు భౌతికవాద తత్వవేత్తలు మానవజీవితానికి శాస్త్రవిజ్ఞానం యొక్క ప్రాధాన్యతను గురించి చెప్పినమాట నిజమే. ఉదాహరణకు. 17వ శతాబ్దంలో ఆధునిక తత్వశాస్త్రానికి మొట్టమొదటి సారిగా భౌతికవాద సంప్రదాయాన్ని సమకూర్చిన ఫ్రాన్సిస్ బేకన్, మానవుడు తన జీవితాన్ని మెరుగు పరచుకొనేందుకు ప్రకృతిపై అతడు విజయం సాధించాలనీ, అదే విజ్ఞాన శాస్త్రంయొక్క అత్యంత ప్రధానమైన లక్ష్యమనీ తెలియజేశాడు. అయితే, పూర్వపు భౌతికవాదులు ఆచరణకు జ్ఞానంయొక్క ప్రాధాన్యాన్ని ఊహించి నప్పటికీ, జ్ఞానానికి ఆచరణ ఎంత ప్రధానమైనదో అర్థంచేసుకోలేదు. మార్క్సుకు పూర్వం భౌతికవాదం ధ్యానపూర్వక (Contemplative) మైనట్టిది. జ్ఞానమంటే కేవలం శాస్త్రవేత్తల సిద్ధాంతకృషిగా అది భావించింది ; శాస్త్రవేత్త లెల్లప్పుడూ ప్రకృతిని పరిశీలించడంలో, దాన్నిగురించి ఆలోచించడంలో నిమగ్నులవుతారని అభిప్రాయపడింది.

ప్రజల సాంఘిక, రాజకీయ కార్యకలాపాలతో గాని. ఉత్పత్తి కృషితోగాని జ్ఞానానికి గల సంబంధాన్ని వారు చూడలేదు. అంతేకాదు. జ్ఞాన సంపాదన కొద్దిమంది వ్యక్తుల ప్రత్యేక హక్కుగా వుండడం, "హీన" కర్మలు, అనగా ఆచరణకు సంబంధించిన కార్యాలూ శారీరక శ్రమా, అజ్ఞానులైన అధిక సంఖ్యాకులు చేయడం సహజమూ అనివార్యమూ అని వారు భావించారు.

మార్క్స్, ఎంగెల్సులు దోపిడీవర్గాల సిద్ధాంతవేత్తల్లో ఉన్న దురభిప్రాయాలను దూరంగా ఉంచడంవల్ల, జ్ఞాన సంపాదనక్రియలో మానవుని ఆచరణాత్మక కృషి నిర్ణాయక పాత్ర వహిస్తుందని వారు గ్రహించ గలిగారు. మానవుడు ఉత్పత్తి క్రమంలో నిత్యమూచేసే కృషి సమాజ జీవితాని కంతకూ భౌతికపునాదిని సృష్టిస్తుందనీ. జ్ఞాన సంపాదనకు కూడా అది గొప్ప సిద్ధాంత ప్రాధాన్యత కలిగి వుంటుందనీ వారు నిర్ధారణకు వచ్చారు. "జ్ఞానసిద్ధాంతంలో జీవిత దృక్పథం. క్రియా దృక్పథం కీలకమైనవిషయం" అని వారు నిరూపించారు. *

మార్క్సుకు పూర్వం వున్న భౌతికవాదంలో వలె కాక, మార్క్సిజం రూపొందించిన జ్ఞానసిద్ధాంతంలో ఆచరణకూడ ఒక భాగమే; జ్ఞాన సంపాదన యొక్క పునాది, లక్ష్యం ఆచరణేననీ. *జ్ఞానం సవ్యమైనదో అపసవ్యమైనదో తెలుసుకోడానికి అది గీటురాయి అనీ* మార్క్సిజం బోధిస్తుంది.

జ్ఞానసిద్ధాంతంలో జీవిత దృక్పథాన్ని. క్రియాత్మక దృక్పథాన్ని ప్రవేశ పెట్టడంద్వారా మార్క్సిజం జ్ఞానాన్ని పరిశ్రమలతోను, వ్యవసాయంతోను, ప్రయోగశాలలతోను. ప్రజల సాంఘిక కృషితోను ప్రత్యక్ష సంబంధ మేర్పరుస్తుంది. సిద్ధాంతమంటే మానవుని ఆచరణాత్మక అనుభవంయొక్క విశ

* లెనిన్ వర్క్స్ - 14 వ సంపుటి, పుట 130 (**Materialism & Empirio - Criticism, Moscow 1952,** పుట 141.)

దీకరణ. సామాన్యీకరణ అని మార్క్సిజం భావిస్తుంది; ఆచరణతో అది సిద్ధాంతరీత్యా భేదిస్తుందని అభిప్రాయపడదు.

మానవుని భౌతికకార్యాలు, మానసిక వ్యాపారాలు ఏ విధంగా విరుద్ధ శక్తులో, అదే విధంగా ఆచరణ, సిద్ధాంతం అనేవి కూడా విరుద్ధ శక్తులే. కాని ఈవిరుద్ధశక్తులు ఒకదానిలో ఒకటి ప్రవేశించి వుంటాయి. సామాజిక జీవితంయొక్క రెండు ప్రతిరోధకపార్శ్వాల ఐక్యతగా, విడదీయరాని పార్శ్వాల ఐక్యతగా అవి రూపొందుతాయి.

సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఐక్యత

సిద్ధాంతం పరిష్కరించవలసిన కొన్నిసమస్యలను ఆచరణ ముందుకు తెస్తుంది; భౌతికప్రపంచానికి సంబంధించిన, మానవసమాజానికి ప్రాధాన్యం కలిగిన పరిణామాలను, పరిణామక్రమాలను, వేర్వేరు పార్శ్వాలను శాస్త్రవేత్తలు అధ్యయనంచేయవలసిన అవసరాన్ని అది తెలియజేస్తుంది. అంతే కాదు. వాటినిగురించిన జ్ఞానం సంపాదించేటందు కవసరమైన భౌతిక సాధనాలను కూడ ఆచరణ సృష్టిస్తుంది. ఆచరణ. ప్రధానంగా శ్రమ, శాస్త్రవేత్తల కవసరమైన పరికరాలను, సాధనసామగ్రిని తయారుచేస్తుంది; ఆ విధంగా శాస్త్రవేత్తలు అతి క్లిష్టమైన సాధనాలతో ప్రయోగాలు చేయడానికి అవకాశాలు కలిగిస్తుంది.

మానవుడు తన జ్ఞానేంద్రియాలను పరిపుష్టమొనర్చుకునేటందుకు, వాటి గ్రాహకశక్తిని అపారంగా వృద్ధిచేసుకునేటందుకు వస్తూత్పత్తి అవకాశాలను కల్పిస్తుంది. సూక్ష్మదర్శిని వస్తువుల ప్రతిబింబాలను వందల, వేల రెట్లు పెద్దవిగా చూపుతుంది. ఎలక్ట్రాన్ సూక్ష్మదర్శిని వాటినే లక్షల రెట్లు పెద్దవిగా చూపుతుంది. తత్ఫలితంగా శాస్త్రవేత్తలు స్థూలదృష్టికి కనిపించని అతిసూక్ష్మ పదార్థాలను చూడగల్గుతున్నారు; వాటిని ఫొటో తీయగల్గుతున్నారు. దూరదర్శిని సహాయంతో మానవుడు భూమికి అనేకలక్షల తేజో

వర్షాల దూరంలోనున్న నక్షత్రాల కాంతిని చూడగల్గుతున్నారు. అనేక వేల మైళ్ళ దూరంలో పరిభ్రమించే స్పుత్నిక్కులనుంచీ, విశ్వాంతర రాకెట్ల నుంచీ సంకేతాలు, శాస్త్రీయసమాచారం తెలుసుకోడానికి రేడియో ప్రక్రియలు సహాయపడుతున్నాయి.

ప్రోటాన్ సింక్రోట్రాన్ అనేపరికరం కొన్నికోట్ల ఎలక్ట్రాన్ వోల్టుల శక్తిని సూక్ష్మకణాల్లో తయారుచేయ గల్గుతోంది. అలాగే ఎటామిక్ రియాక్టర్లు, శక్తివంతమైన దూరదర్శినులు ఒక్కొక్క సెకండుకు లక్షల సంఖ్యలో లెక్కలుచేసే ఎలక్ట్రానిక్ కంప్యూటర్లు తయారుచేయ బడు తున్నాయి. ఇవి లేకుండా ఆధునిక విజ్ఞానశాస్త్రం నేటిస్థితికి వచ్చియుండేదా? ఎన్నటికీ కాదు.

ఈవిధంగా. ఆచరణకు సంబంధించిన అవసరాలవల్ల ఉత్పన్న మౌతున్న విజ్ఞానశాస్త్రం మళ్లీ ఆచరణమీద అంతకంతకు అధికంగా అత్యంత బలీయమైన ప్రభావం కలుగజేస్తుంది. 20 శతాబ్దంలో ఉత్పత్తి శక్తులు ఆపారంగా అభివృద్ధి చెందడంతో. సాంకేతికశాస్త్రం బ్రహ్మాండమైన విజయాలు సాధించింది. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి? పరిశ్రమల్లోనూ, వ్యవసాయంలోనూ. రవాణామార్గాలలోను. సమాచార ప్రసారంలోను శాస్త్ర విషయాలను విస్తృతంగా, సమగ్రంగా వర్తింప జేయడంవల్లనే యివి సాధ్య మయాయి. యంత్రాలలో, యంత్రప్రక్రియలలో, సాంకేతికక్రమాలలో శాస్త్రీయ నియమాలనూ. సాంకేతికాలను (Formulae) వర్తింపజేయడం వల్లనే ఇవి సాధ్యమయాయి.

ప్రకృతినియమాలను తెలుసుకోవడం ద్వారా. మానవుని మనస్సు అతని భౌతిక ఉత్పత్తికార్యాలను నడుపుతోంది; అతని పరిసరాలను పునర్వ్యవస్థీకరించగల శక్తిగా అది తయారవుతోంది. ఈ సందర్భంలో లెనిన్ ఇలా అన్నాడు :

"మానవుని చైతన్యం భౌతికప్రపంచాన్ని ప్రతిబింబించడం మాత్రమే చేయదు; దాన్ని సృష్టిస్తుంది కూడా."*

కాబట్టి, సిద్ధాంతానికి ఆచరణకూ మధ్య. విజ్ఞానశాస్త్రానికి ఉత్పత్తికి మధ్య అన్యోన్యసంబంధం ఉంది. ప్రతిస్పందన ఉంది. ఇందులో ఆచరణ కీలకపాత్ర వహిస్తుంది. సమాజం భౌతికంగాను, సాంకేతికంగాను పురోగమించడానికి యీ అన్యోన్యసంబంధం, ప్రతిస్పందన తప్పనిసరిగా ఉండాలి.

సామాజిక, రాజకీయ జీవితంలో కూడా సిద్ధాంతానికి ఆచరణకూ నిరంతర ప్రతిస్పందన జరుగుతుంది. ఇక్కడకూడా సిద్ధాంతం సామాజిక జీవితం యొక్క. వర్గపోరాటంయొక్క అవసరాలనుంచే ఉత్పన్నమవుతుంది; తిరిగి సమాజపరిణామక్రమంపై తన ప్రభావం కలుగజేస్తుంది. నిజమైన సామాజికశాస్త్రాన్ని మొట్టమొదట రూపొందించింది మార్క్సు అనేమాట నిజమే. అయినా, మార్క్సుకు పూర్వం కూడ అభ్యుదయకరమైన సామాజిక సిద్ధాంతాలున్నాయి; వాటిలో శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన అంశాలు కూడా కొన్ని ఉన్నాయి; అవి ఆనాడు అత్యంత అభ్యుదయకరమైన పాత్ర నిర్వహించాయి; సమాజంలోని అభ్యుదయశక్తులు తమ తక్షణ, ఆచరణాత్మక లక్ష్యాలనూ, సమస్యలనూ తెలుసుకోడానికి అవిసహాయపడ్డాయి; అభివృద్ధినిరోధకత్వానికీ, కాలం చెల్లిన సంస్థలకూ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆ శక్తుల్ని బలపరిచాయి; ఉత్తేజపరిచాయి.

మార్క్సు ఎంగెల్సులు సమాజాన్ని గురించిన తమ శాస్త్రీయ భౌతిక దృక్పథాన్ని రూపొందించిన తర్వాత. సామాజిక జీవితంలోను, ప్రజలమధ్య సంబంధాల్లోను సిద్ధాంతంయొక్క ప్రాధాన్యత అపారంగా పెరిగింది.

---

* లెనిన్ ; వర్క్సు — 14 వ సంపుటి. పుట 130 (Materialim and Empirio-criticism, Moscow, 1952, పుట 141.)

సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం నిర్దేశించిన విధంగా, సిద్ధాంత-ఆచరణల మధ్య ఐక్యత అనే సూత్రాని కనుగుణంగా నడుచుకొని యుండక పోతే, సోవియట్ యూనియన్ తదితర దేశాల్లో సోషలిస్టు విప్లవం విజయం పొందడం గాని, సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు నిర్మాణం, యితర సోషలిస్టుదేశాల్లో సోషలిస్టు నిర్మాణంగాని సాధ్యమై వుండేవి కావు.

సిద్ధాంతం కార్మికవర్గ పోరాటానికి, అంటే ఆచరణకు, సహాయ పడుతుంది. అలాగే, ఆచరణ సిద్ధాంతానికి దోహదమిస్తుంది. ఇలా జరక్క పోతే, సిద్ధాంతమూ ఆచరణ కూడా నష్టపడతాయి. ఆచరణనుంచి విడివడ్డ సిద్ధాంతం నిరర్థకమైనది ; సిద్ధాంతాన్ని మార్గదర్శిగా చేసుకొనని ఆచరణ చీకట్లో తడుముకోవడం వంటిది.

సోషలిజంలో సిద్ధాంత పురోగతీ, ఆచరణవల్ల లభించే విజయాలూ ఒకదాని సరసన ఒకటి నడుస్తాయి. సోషలిస్టు శిబిరానికి చెందిన దేశాల్లో సోషలిస్టునిర్మాణం, కమ్యూనిస్టునిర్మాణం మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతంచే నడుపబడుతున్నాయి ; రెండోవైపు, నూతన సమాజాన్ని నిర్మిస్తున్న ప్రజల ఆచరణ సిద్ధాంతాన్ని పరిపుష్టం చేస్తుంది. ఎన్. ఎస్. కృశ్చేవ్ యిలా అన్నాడు :

> "సోషలిస్టునిర్మాణానికి సంబంధించిన ప్రతి ఆచరణాత్మక సమస్య సిద్ధాంతసమస్య కూడా ; మార్క్సిజం - లెనినిజంను సృజనాత్మకంగా అభివృద్ధిచేయడంలో అది ప్రత్యక్షపాత్ర వహిస్తుంది. ఒకదాన్ని రెండవ దానితో విడదీయడానికి వీల్లేదు." §

---

§ ఎన్. ఎస్. కృశ్చేవ్ : Fcr victory in the peaceful competition with capitalism, Moscow, Foreign Languages Publishing House, పుట 446.

ఆచరణే శాస్త్రవిజ్ఞానికి అంతిమ లక్ష్యమని మార్క్సిజం చెబుతూందంటే అర్థం, సిద్ధాంతాన్ని అది చిన్నచూపు చూస్తుందని ఏ మాత్రం కాదు; సంకుచిత ఆచరణతత్వానికీ, మార్క్సిజానికీ సంబంధమేమీ లేదు. విజ్ఞానశాస్త్రానికీ, జీవితానికీ మధ్య సంబంధముండాలని చెప్పడమంటే, ఆచరణకు సంబంధించిన విధులనుంచి విజ్ఞానశాస్త్రాన్ని వేరుచేసే ధోరణిని వ్యతిరేకించడమే: సిద్ధాంతాన్ని నిరర్థకమైన మనోవ్యాపారంగా మార్చే ధోరణి నెదుర్కోవడమే. అయితే, దీని అర్థం అంతిమ లక్ష్యాన్ని విసర్జించడం కాదు; సిద్ధాంతపరిశోధన యొక్క కర్తవ్యాలను ఆచరణకు సంబంధించిన తక్షణావసరాలకే పరిమిత మొనర్చడం కాదు. విజ్ఞానశాస్త్రం, సాంకేతికశాస్త్రం నిరంతరం అభివృద్ధిచెందాలంటే, భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యం వహించే సిద్ధాంతపరిశోధన తప్పనిసరిగా అవసరం. అది వాస్తవికతకు సంబంధించిన కొత్త సంబంధాలను, కొత్త నియమాలను కనిపెడుతుంది; ముందుముందు జరిగే శాస్త్రాభివృద్ధికీ, సాంకేతికాభివృద్ధికీ సిద్ధాంత "నిధుల"ను సమకూర్చిపెడుతుంది. తాత్కాలికావసరాలకోసం శాస్త్రీయసత్యాన్ని అపభ్రంశమొనర్చే ప్రయత్నాన్ని మార్క్సిజం ఎన్నటికీ సహించదు.

శాస్త్రపరిశోధనలో నిష్పాక్షికత ఉండాలనీ, వాస్తవ విషయాలను-అవి ఏవైనప్పటికీ - అపభ్రంశ మొనర్చరాదనీ మార్క్సిజం నిర్దేశిస్తుంది. నిష్పాక్షిక పరిశోధన అనే సూత్రం ఉల్లంఘింపబడకుండా మార్క్సిజం నిరోధిస్తుంది. కార్మికవర్గం పెట్టుబడిదారీ దోపిడీనుంచి విముక్తి పొందేటందుకు పోరాడే దశలోను, సోషలిస్టు కమ్యూనిస్టు నిర్మాణదశలోను కూడ సిసలైన జ్ఞానం సంపాదించాలని గాఢంగా కోరుతుంది. అట్టి జ్ఞానంలో సమాజాభివృద్ధికి సంబంధించిన నియమాలను తెలుసుకోవడం ఒక భాగం. ఎందుచేతంటే, కార్మికవర్గం తప్పనిసరిగా సాధించే అంతిమ విజయానికి సంబంధించిన నియమాలవి.

పెట్టుబడిదారీ వర్గం నిష్పాక్షిక శాస్త్రీయ పరిశోధనలో, ముఖ్యంగా సామాజిక శాస్త్రంలో, చాలాకాలం క్రిందటే ఆసక్తిని కోల్పోయింది. ఆ రంగంలో దాని ప్రధానకోరిక మార్క్సిజాన్ని ఖండించటం, పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే వాదనలకోసం వెతకడమూను.

ప్రకృతి శాస్త్రాలలోసైతం పెట్టుబడిదారీవర్గం సిసలైన జ్ఞానాన్ని సంపాదించడంలో అంతగా ఆసక్తి చూపడంలేదు; దానినుంచి లభించే తక్షణ ప్రయోజనాలమీదనే తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. విజ్ఞానశాస్త్రం పట్ల పెట్టుబడిదారీవర్గంయొక్క వైఖరి కేవలం ప్రయోజనాత్మకమైనది. పెట్టుబడిదార్లను *ఒక వర్గంగా* ఉద్దేశించి చెపుతున్న మాటయిది. పెట్టుబడి దారీ సమాజంలోని నిష్కపటులైన, నిజాయితీపరులైన శాస్త్రవేత్తలకు ఇది వర్తించదు.

సోషలిస్టు సమాజంలో శాస్త్రీయపరిశోధనకు ఆటంకాలేవి ఉండవు. ప్రపంచాన్ని గురించి తెలుసుకోవడం శాస్త్రవేత్తల వ్యక్తిగత విషయం కాదనీ, సామాజికంగా అత్యధిక ప్రాధాన్యంగల విషయమనే అవగాహన నిజాయితీపరులైన శాస్త్రవేత్తలందరినీ ఉత్తేజపరుస్తుంది; సత్యాన్ని వారు విధేయతతో, భక్తిశ్రద్ధలతో సేవించేటట్లు ఉత్సాహపరుస్తుంది.

2. జ్ఞానం భౌతికప్రపంచంయొక్క ప్రతిబింబం, లేదా పరావర్తనం

మార్క్సిస్టు జ్ఞానసిద్ధాంతం *పరావర్తన* (Reflection) *సిద్ధాంతం*. దీని అర్థం, మానవుని మనస్సులో భౌతిక ప్రపంచం ప్రతిబింబించడమే జ్ఞానం. గతితార్కిక భౌతికవాదాన్ని వ్యతిరేకించేవారు సాధారణంగా ఈ దృక్పథాన్ని ఆక్షేపిస్తారు. ఉదాహరణకు, మన కంటికి కనపడని ప్రకృతి నియమాలు ప్రతిబింబింపబడ్డం అర్థంలేని విషయమనీ, గణితశాస్త్ర సాంకేతికాలనుగాని, తర్కశాస్త్ర తత్వాలను గాని (ఉదా : "అంతస్సత్యం"), నైతిక

భావనలనుగాని (ఉదా : "న్యాయం", "ఔన్నత్యం) ప్రతిబింబించే వాస్తవికత అంటూ ఉండదని వారు వాదిస్తారు. ఐతే యివీ, ఇలాంటివే యితర వాదనలూ పరావర్తనను గురించిన అనాది దృక్పథంపై, అశిక్షిత దృక్పథంపై ఆధారపడి ఉన్నాయి.

జ్ఞానమంటే పరావర్తనమని గతితార్కిక భౌతికవాదం నిర్వచిస్తూందంటే అర్థం వాస్తవికత మానవుని చైతన్యంలో పునరుత్పత్తి అవుతోందనీ, అందుచేత అది భౌతికప్రపంచంయొక్క ప్రతిబింబం తప్ప మరొకటి కాదనీ చెపుతోందన్నమాట. మానవుని చైతన్యంలో ఉండేవి వస్తువులూ, వాటి ధర్మాలూ, వాటిమధ్య సంబంధాలూ కావు. వాటి మానసిక ప్రతిబింబాలే మానవచైతన్యంలో ఉంటాయి. ఈ ప్రతిబింబాలు దాదాపు ఖచ్చితంగా సకలవస్తువుల లక్షణాలను చిత్రిస్తాయి; ఈ అర్థంలో వాటి వలెనే వుంటాయి.

అదేవిధంగా, వాస్తవికజగత్తులో, భౌతికజగత్తులో, ఉండేవి భౌతిక పదార్థాలు, సంబంధాలే గాని, సాంకేతికాలు (Formulae), భావనలు concepts) కావు. ఈ సాంకేతికాల్లోను, భావనల్లోను భౌతిక పదార్థాలు, సంబంధాలు ప్రతిబింబిస్తాయి.

భౌతికవాదానికి చెందిన ఈపరావర్తన సిద్ధాంతం చైతన్యానికీ పదార్థానికీ మధ్య. జ్ఞానానికీ జ్ఞేయవస్తువుకూ మధ్య వున్నతేడాను గమనిస్తుంది. ఐతే, చైతన్యాన్ని పరమరూఢమైన దృష్టితో పదార్థంతో పోటీపెట్టదు. కారణమేమంటే, మానవునిచైతన్యంలో ప్రతిబింబించేది భౌతికవాస్తవికతే గనుక; చైతన్యమే పదార్థధర్మంగనుక.

పదార్థంయొక్క ఉన్నత నిర్మాణ రూపమైన మెదడుయొక్క ధర్మమే మనస్సు. ఈ విషయాన్ని మనం గుర్తిస్తే, ఆలోచనకూ భౌతిక ప్రపంచానికీ మధ్య ప్రధానమైన భేదమేదీ ఉండదనీ, ప్రవేశించలేని సరిహద్దురేఖ ఏదీ ఉండదనీ నిర్ధారణకు రావలసివుంటుంది.

భౌతిక పదార్థాలతోబాటు మానసిక పరిణామాలు కూడ జ్ఞేయములనేమాట వాస్తవమే. కాని ఇది జ్ఞానంయొక్క స్వభావాన్ని ఏ మాత్రమూ మార్చదు. ఎందుచేతంటే, అట్టి పరిణామాలు మానవచైతన్యానికి వెలుపల వున్న భౌతికవాస్తవికతకు ప్రతిబింబాలు.

అంతేగాక, మానవుని జ్ఞానసంపాదనశక్తి భగవంతునిచే ప్రసాదింపబడిన దివ్యమహిమ ఏమీకాదు; ప్రత్యక్షకార్యాచరణ అనేపునాదిపై దీర్ఘకాలం కొనసాగిన జ్ఞానసంపాదనక్రమంయొక్క, లేదా భౌతికప్రపంచపు పరావర్తనంయొక్క ఫలితం అది. ఈక్రమంలో మనజ్ఞానేంద్రియాలు అభివృద్ధిచెంది, ఆలోచన మెరుగుపడింది.

ఇవీ జ్ఞానంవిషయంలో మార్క్సిస్టు తత్వశాస్త్రం బోధించే మూలసూత్రాలు. మానవుడు తన చుట్టూవున్న ప్రపంచాన్ని తెలుసుకొని ప్రతిబింబించగల్గడంతో అది ప్రారంభమౌతుంది: జ్ఞానపురోగతికి అది అనంతమైన అవకాశాలను కలిగిస్తుంది.

అ జ్ఞే య వా ద ఖ ం డ న

భావవాదధోరణికి చెందిన అనేకమంది తత్వవేత్తలూ, వారిపలుకుబడిక్రిందనున్న కొందరు శాస్త్రవేత్తలూ ప్రపంచాన్ని గురించి మనం తెలుసుకోగలమనే అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తారు.

వారు అజ్ఞేయ వాదాన్ని (Agnosticism) బలపరుస్తారు. (గ్రీకుభాషలో "ఎగ్నాసిస్" అనేశబ్దం నుంచి "ఎగ్నాస్టిసిజం" అనే ఇంగ్లీషుమాట పుట్టింది. గ్రీకుభాషలో 'ఎ' అంటే అర్థం "లేదు;" "గ్నాసిస్" అంటే "జ్ఞానం") అజ్ఞేయవాది దేన్నీ మనం తెలుసుకోలేమని చెప్పడు. తరచు అతడు మూలసిద్ధాంతంలోనే కొన్ని పరిష్కరించలేని సమస్యలున్నాయని "మాత్రం" సూచిస్తాడు: విజ్ఞానశాస్త్రం, సాంకేతికశాస్త్రం ఎంతఅభివృద్ధిచెందినా, మానవుని బుద్ధి ఎంత వికసించినా మూలసిద్ధాంతం

లోనే వాస్తవికతకు సంబంధించిన కొన్నిరంగాలను మనమెన్నటికీ తెలుసు కోలేమంటాడు.

ఉదాహరణకు, డేవిడ్‌హ్యూమ్ అను 18 వ శతాబ్దపు స్కాటిష్ అజ్ఞేయవాది, ఇంద్రియానుభూతులుమాత్రమే మనకందుబాటులో వుంటాయనీ, శాస్త్రంయొక్క పరమావధి వాటిని సమకూర్చి క్రమబద్ధమొనర్చడం మాత్రమేననీ చెప్పాడు. అతని అభిప్రాయంలో మనఇంద్రియానుభూతుల వెనుకనున్నదానిని, వాటికిగలకారణాలను మనం తెలుసుకోలేం. అందుచేత, తత్వశాస్త్రంయొక్క మూలసమస్యను మనమెవ్వరం పరిష్కరించలేమని అతడన్నాడు. ప్రపంచం దేనిమీద ఆధారపడిఉందో-పదార్థంమీదనా చైతన్యం మీదనా - మనం చెప్పలేమన్నాడు. మనమెన్నటికీ ఇంద్రియానుభూతుల వలయం దాటివెళ్ళలేము గనుక మనకది సాధ్యంకాదని అతడన్నాడు.

అతని సమకాలికుడైన ఇమ్మాన్యుయల్ కాంట్ అను జర్మన్ తత్వవేత్త మానవునికీ, మానవ ఆలోచనకూ వెలుపల స్వతంత్రంగా వున్న పదార్థాలవల్లనే ఇంద్రియానుభూతులు కలుగుతున్నాయని అంగీకరించాడు. కాని ఈ పదార్థాలు మూల సిద్ధాంతంలో జ్ఞానానికి వశంకావన్నాడు. వాటిని పరమపదార్థాలు (Things - in - Themselves) అన్నాడు.

అజ్ఞేయవాదానికీ, "భగవంతుని విలాసాలు మన అవగాహనకందవు" అనే మత సిద్ధాంతానికీ చాలా దగ్గర సంబంధముంది. మానవవివేచన పరిమిత మైనదనీ, వాస్తవికతను తెలుసుకోడానికి మానవుడు శాస్త్ర బాహ్యమైన మరొక మార్గం అవలంబించాలనీ చెప్పే మత సిద్ధాంతంతో కూడ ఇది దగ్గర సంబంధం కలిగివుంది. "తాను విశ్వాసానికి స్థానమీయడం కోసం జ్ఞానాన్ని విసర్జించ"వలసి వచ్చిందని కాంటు స్వయంగా అంగీకరించాడు. అజ్ఞేయతాత్వికులు భగవంతుని నమ్మని సందర్భాలలోకూడ క్రైస్తవ పీఠానికి మిత్రులుగానే వ్యవహరిస్తున్నారు. కారణమేమంటే, ప్రపంచాన్ని అర్థం చేసుకోలేమనే పొరబాటు అభిప్రాయాన్నేర్పరచుకొన్న అజ్ఞేయవాదం

శాస్త్రాభివృద్ధిని నిరాకరిస్తుంది; ఈశ్వరవాదాన్ని పటిష్టమొనర్చుతుంది. మానవుణ్ణి మూఢ నమ్మకాలవైపు మరల్చుతుంది. మతసిద్ధాంతాలను నమ్మేటట్లు చేస్తుంది.

జీవితవాస్తవాలు అజ్ఞేయవాదాన్ని అన్ని రూపాల్లోను ఖండిస్తున్నాయి. మానవుడు మొదట నెమ్మదిగాను, తరువాత అంతకంతకు వేగంగాను అజ్ఞానంనుంచి జ్ఞానానికి ఏ విధంగా చేరుకున్నాడో, పైకి అర్థంకానట్లు తోచే రహస్యాలను క్రమంగా ప్రకృతి ఏ విధంగా అతనికి వెల్లడిస్తూవచ్చిందో విజ్ఞానశాస్త్ర చరిత్ర తెలియజేస్తుంది.

500 సంవత్సరాల క్రిందట ప్రజలు యీ పరిమితప్రపంచానికి భూమి కేంద్రమనీ, నక్షత్రాలు పంపుతిరిగిన ఒక గాజు దోము వంటి ఆకాశానికి తాపడంచేయబడి వున్నాయనీ భావించేవారు. ఈ అభిప్రాయాలను కొపెర్నికస్, బ్రూనో, గెలీలియో అను గొప్ప పునరుజ్జీవనభావుకులు ఖండించారు; విశ్వంయొక్క గాజు దోమును వారు పగులగొట్టి, అనంత విశ్వంగా చేశారు. నూరు సంవత్సరాలక్రిందట కూడా, ఖగోళాలనిర్మాణమూ వాటి సంపుటి ఎన్నడూ మనం గ్రహించలేని చిక్కుసమస్యలుగానే ఉంటాయని కొందరు అభిప్రాయపడేవారు. ఉదాహరణకు, ఆగస్టుకాంటే అను పాజిటివిస్టు, నక్షత్రాలలో ఏముందో మానవుడు తెలుసుకోజాలడని ఖండితంగా చెప్పివేశాడు. కాని అతడు చనిపోయిన (1859) రెండు సంవత్సరాల తరువాత కనిపెట్టబడిన వర్ణమాల విశ్లేషణపద్ధతి ఖగోళాలలోని రసాయనిక పదార్థాలను పరిశోధించడానికి ప్రాతిపదిక నేర్పరచింది. 20 వ శతాబ్ది ప్రారంభంలో ఖగోళశాస్త్రం పాలపుంత (ఒక నక్షత్రకూటమి) పరిధులను దాటి వెళ్ళలేకపోయింది. కాని ఆధునిక పరిశీలనా పద్ధతులవల్ల, లక్షల సంఖ్యలో నక్షత్రకూటా లున్నాయని తెలిసింది; ఊహకుకూడా అందని దూరాలలోని అనంతవిశ్వం యొక్క నిర్మాణాన్ని గురించి స్థూలంగా మనం యిప్పుడు తెలుసుకోగల్గుతున్నాం.

అంతుతెలియని విశ్వాంతరాళంలో మానవుడు అడుగుపెట్టగల్గడమే కాక, సూక్ష్మజగత్తులోకికూడ అతడు లోతుగా ప్రవేశిస్తున్నాడు. ప్రాణం యొక్క పుట్టుకనుగురించి ఎన్నోపరిశోధనలు జరుగుతున్నాయి. ఆ రహస్యాన్ని భేదించే లక్ష్యం అతనికెంతో దూరంలోలేదు. దాన్ని అతడు అంతకంతకు సమీపిస్తున్నాడు. ప్రతిచోటా సమస్త శాస్త్రీయరంగాల్లో మనం శాస్త్ర పరిజ్ఞానంయొక్క అపారశక్తిని చూడగల్గుతున్నాం.

అజ్ఞేయవాదాన్ని తిరస్కరించేటందుకు అత్యంతబలమైన సాక్ష్యం ఆచరణ, మానవకార్యకలాపాలు, ఉత్పత్తిక్రమం. ఒకానొక పరిణామాన్ని మనం తీసుకురాదలచుకున్నా మనుకొందాం. దాన్నిగురించి మనకున్న అభిప్రాయాని కనుగుణంగా దాన్ని తీసుకువచ్చినవెంటనే అది మనప్రయోజనాన్ని ఈడేర్చగలిగేటట్లుకూడా ఉంటే, ఆపరిణామాన్ని గురించిన మన అభిప్రాయం కొన్నిహద్దుల్లో వాస్తవికమైన విశ్వసనీయమైన జ్ఞానమౌతుందని ఎంగెల్సు తెలియజేశాడు. *

భౌతికశాస్త్రజ్ఞులు ప్రయోగశాలల్లో చేసే పరిశోధనలు సిద్ధాంత గణనములతో (Theoretical calculations) ప్రారంభించి, యూరేనియం పరమాణువులో వరుసవిచ్ఛేదన క్రమాన్ని (Chain reaction of disintegration) కొనిరావడ మెలాగో తెలుసుకున్నారు. అంతేగాక, ఈ విచ్ఛేదనక్రమాన్ని పరమాణుపేర్పులో (Atomic pile) నియంత్రణ మొనర్చడం కూడ కనిపెట్టారు. పారిశ్రామిక రియాక్టర్లలో అణుశక్తిఉత్పత్తి కావడంబట్టి, శాస్త్రవేత్తల కృషికంతకూ ప్రారంభవిషయమైనభౌతికశాస్త్రసిద్ధాంతాలు సరియైనవని రుజువైంది; ఆంతరిక అణుగర్భక్రమాల నియమాలలో కొన్నిటినిగురించి మనకుసరియైన పరిజ్ఞానమే ఉన్నదని నిరూపితమౌతూంది.

---

* కారల్ మార్క్సు, ఫ్రెడరిక్ ఎంగెల్సు : Selected works, Moscow, Foreign Languages Publishing House, 1958' Vol, II. పుట 1u0.

విశ్వాంతరయానానికి జట్ ఇంజన్లను, రాకెట్లను ఉపయోగించవచ్చునని సియోల్‌కోవ్‌స్కీ కొన్ని సూత్రాలప్రాతిపదికపై ఒక నిర్ధారణకు వచ్చాడు. ఆ నిర్ధారణ మనకండ్లఎదుటే విశ్వాంతరయానానికి నాందీప్రస్తావన చేసింది. జెట్ విమాన గమనం, మానవనిర్మిత ఉపగ్రహాలు విశ్వాంతర రాకెట్లు మొదలైనవాటినిబట్టి, సియోల్‌కోవ్‌స్కీ అభిప్రాయాలూ అంచనాలూ, అతని తరువాత పరిశోధనలు జరిపినవారి అభిప్రాయాలూ అంచనాలూ సరియైనవేనని, వాటికి చక్కని ఆధారాలున్నాయని రుజువైంది.

జ్ఞానంయొక్క శక్తి ఎంత అపారమైనదో తెలుసుకోదానికి ఆధునిక సాంకేతిక శాస్త్రంలోను, పరిశ్రమల్లోను అసంఖ్యాకమైన ఉదాహరణలున్నాయి.

3. సత్యాన్ని గురించిన సిద్ధాంతం

జ్ఞానసిద్ధాంతంలో సత్యాన్ని గురించిన సమస్య కీలకమైనది; ప్రతి విజ్ఞానశాస్త్రానికీ యిది అత్యంత ప్రధానమైన సమస్య. ఏశాస్త్రీయ సిద్ధాంతమైనా నిజమైన జ్ఞానాన్ని ఇవ్వకపోతే, దానికి చిల్లిగవ్వంత విలువ కూడ వుండదు.

మనజ్ఞానానికీ భౌతిక వాస్తవికతకూ గల సంబంధాన్ని తెలుసుకోదలచినప్పుడల్లా సత్యానికి సంబంధించిన సమస్య ఉత్పన్నమౌతూ ఉంటుంది. భౌతిక ప్రపంచం స్వతంత్రంగా మన చైతన్యం వెలుపల ఉంటుంది గనుక జ్ఞాన సంపాదన క్రమంలో మన ఊహాలు, మన భావాలు అభిప్రాయాలు. సిద్ధాంతాలు వాస్తవికతకు అనుగుణంగా ఉండాలనే విషయం స్పష్టం. వాస్తవ విషయాలను గూర్చి మనకున్న అభిప్రాయాల కనుగుణంగా మనం వాటిని మలచలేము; మన అభిప్రాయాలే వాస్తవ విషయాల కనుగుణంగా ఉండేటట్టు చూచుకోవాలి. మరోవిధంగా వ్యవహరించేవారు నిర్జీవమైన స్వీయాత్మక ధోరణికి తప్పక లొంగిపోతారు; వాస్త

ఏక దృష్టిని కోల్పోతారు. కోర్కెను ఆలోచనకు మూలం చేస్తారు. చివరకు తమ కార్యాల్లో విఫలు లౌతారు.

మన ఇంద్రియానుభూతులు అభిప్రాయాలు, భావనలు, సిద్ధాంతాలు, భౌతికవాస్తవికతకు అనుగుణంగా వుంటే, దాన్ని అవి సరిగా ప్రతిబింబిస్తే అప్పుడు అవి నిజమైనవని అంటాం; నిజమైన అభిప్రాయ ప్రకటనలను, నిర్ధారణలను, లేదా సిద్ధాంతాలను మనం సత్యం అంటాం.

జ్ఞానంయొక్క లక్ష్యం సత్యాన్ని కనుగొనడమని తరచు మనం అంటూవుంటాం. దీనిఅర్థం, సత్యం అనేది తనంతటతాను ఒకచోట వుంటుందనీ, మానవుడు దానిమీద కాకతాళీయంగా వచ్చిపడతాడనీ లేకదాన్ని కనుక్కుంటాడనీ కాదు. నిజమైనజ్ఞానం సంపాదించడమే జ్ఞానసంపాదనక్రమం యొక్కలక్ష్యమని దీనిఅర్థం. ఈవిషయాన్ని మనంజ్ఞాపకముంచుకోవాలి. కారణమేమంటే, సత్యాలు స్వతంత్రంగా ఉంటాయనీ అన్నిపరిస్థితుల్లో మానవుడు వాటినిగురించి ఆలోచించగలడనీ, వాటిని వర్ణించగలడనీ కొందరుభావవాదులు వాదిస్తారు. నిజంచెప్పవలసివస్తే, "సత్యం" అనేమాట మానవుని జ్ఞానానికిమాత్రమే. భావాలకుమాత్రమే, సిద్ధాంతాలకుమాత్రమే వర్తిస్తుంది. భౌతికప్రపంచంలో ఉండేవి సత్యాలుకావు. వస్తువులు, పరిణామాలు, సంబంధాలు, క్రమాలు మొదలైనవే భౌతికప్రపంచంలో ఉంటాయి. అవి మానవుని వాస్తవిక భావాలలోను, అభిప్రాయాలలోను ప్రతిబింబిస్తాయి.

భౌతిక సత్యం

సత్యం మానవుని జ్ఞానసంపాదన క్రమంలోనే ఉత్పన్నమవుతున్నప్పటికీ, అందులో ప్రతిబింబించే పదార్థధర్మాలు. పదార్థ సంబంధాలు మానవుని మీద ఆధారపడి ఉండవు. కనుకనే. సత్యం భౌతికమైనదని అంటాం.

కాబట్టి, భౌతికసత్యం అంటే అర్థం, భౌతిక ప్రపంచాన్నీ, దాని నియమాలనూ, ధర్మాలనూ సరిగా ప్రతిబింబించే జ్ఞానం. ఈ అర్థంలో

జ్ఞానం "కర్త (Subject)మీద ఆధారపడదు .... మానవుని మీదగాని, మానవ జాతిమీదగాని ఆధారపడదు."* మానవునికి సత్యంమీద ఆధిపత్యం లేదు. అతడు తనచుట్టూవున్న ప్రపంచాన్ని మార్చగలడు; తన జీవిత పరిస్థితుల్ని కూడా మార్చగలడు; కాని సత్యాన్ని తన యిష్టంప్రకారం మార్చలేడు. కారణమేమంటే, అది భౌతిక ప్రపంచంయొక్క ప్రతిబింబం.

ప్రతిసత్యం భౌతికసత్యం. వాస్తవికతకు అనుగుణంగా లేని స్వీయాత్మక భావానికీ, సత్యానికీ గల వ్యత్యాసాన్ని మనం గుర్తించాలి. మనోవికారానికీ, లేదా భ్రాంతికీ సత్యానికీ గల భేదాన్ని గమనించాలి. వ్యక్తులు సత్యమని అనుకొన్న, లేదా అనుకొంటున్న విషయాలన్నీ సత్యాలుకావు. ఉదాహరణకు సూర్యుడు భూమిచుట్టూ తిరుగుతున్నాడని ప్రజలు చాలకాలం భావించారు. కాని అది పొరపాటు అభిప్రాయం. సూర్యుడు కేంద్రంగా ఉన్న సౌరకుటుంబంలో భూమి తదితర గ్రహాలు తమతమ కక్ష్యలలో సూర్యునిచుట్టూ తిరుగుతున్నాయని ఆధునిక ఖగోళశాస్త్రం నిరూపించింది. ఇది భౌతికసత్యం. ఎందుచేతంటే, వాస్తవికతను యిది సరిగా ప్రతిబింబిస్తోంది; మానవునిమీద ఆధారపడకుండా, స్వతంత్రంగా ఉండె సౌర కుటుంబంయొక్క అసలు స్వభావాన్ని అది ప్రతింబింబిస్తోంది.

జ్ఞా న సం పా ద న క్ర మం

మానవుని చైతన్యంలో భౌతిక ప్రపంచం ప్రతిబింబించడాన్ని మనం అధిభౌతిక దృక్పథంతో పరిశీలించకూడదు; ఏక క్రియగా దాన్ని అర్థం చేసుకోకూడదు. జ్ఞానసంపాదన అనేది ఒక క్రమం. దానికనేక పార్శ్వాలుంటాయి. అన్యోన్య సంబంధం గల వేర్వేరు దశలుంటాయి. దీన్ని వర్ణిస్తూ లెనిన్ యిలా వ్రాశాడు :

* లెనిన్ ; వర్క్స్-14 వ సంపుటి, పుట 110 (Materialism and Empirio - Criticism, Moscow 1952, పుట 119).

> "సత్యాన్ని గురించి, భౌతిక వాస్తవికతను గురించి తెలుసుకొనే గతితార్కిక క్రమం ప్రాథమిక ధ్యానదశ నుంచి భావనాత్మక సమాలోచనకూ, అక్కడినుంచి ఆచరణకూ జరిగే పురోగమనం."*

మానవుడు తన పరిసరాలను కేవలం చూస్తూండడంద్వారా కాక, వివిధ పదార్థాలతో క్రియాత్మక సంబంధాలేర్పరచుకోడంద్వారా జ్ఞానసంపాదిస్తున్నాడని పైన తెలుసుకున్నాం. మానవుణ్ణి భౌతిక ప్రపంచంతో ప్రత్యక్షంగా కలిపేది ఆచరణే. మనలో రకరకాలైన ఇంద్రియానుభూతుల్ని కలిగించేది ఆచరణే; వ్యక్తియొక్క జ్ఞానసంపాదన క్రమంలోను, మానవజాతియొక్క జ్ఞానసంపాదన చరిత్రలోను యిది ప్రాథమికదశ. క్లుప్తంగా చెప్పాలంటే, జ్ఞానసంపాదనలో మొట్టమొదటి దశ ఇంద్రియానుభూతులు (Sensations).

పదార్థాల, పదార్థధర్మాల ప్రతిబింబాలే ఇంద్రియానుభూతులు

అంత్యపరిశీలనలో, సమస్తజ్ఞానమూ ఇంద్రియానుభూతులనుంచే ఉత్పన్నమౌతుందిగనుక, జ్ఞానంయొక్క వాస్తవికత (సత్యం) ప్రధానంగా ఇంద్రియానుభూతులు వాస్తవమైనవా కావా అనేవిషయంమీద ఆధారపడి వుంటుంది. అంటే, భౌతికపదార్థాలనూ, వాటిధర్మాలనూ అవి యథాతథంగా ప్రతిబింబిస్తున్నాయాలేదా అనేవిషయంమీద ఆధారపడి వుంటుంది. గతితార్కిక భౌతికవాద మూలసూత్రాలపై ఆధారపడివున్న మార్క్సిస్టు జ్ఞానసిద్ధాంతం ఈప్రశ్నకు ఔనని జవాబిస్తుంది. ఇంద్రియానుభూతులతో ప్రారంభమయే ప్రతిజ్ఞానసంపాదన క్రియలోను భౌతికసత్యమే వుంటుంది. మానవుని భావాలవలెనే, అభిప్రాయాలవలెనే అతని ఇంద్రియానుభూతులు కూడ పదార్థాల, పదార్థధర్మాల ప్రతిబింబాలు, లేక ప్రతిరూపాలు (Images).

---

*లెనిన్ వర్క్సు: వర్క్సు 38 వ సంపుటి, పుట 161

ఐతే, దీన్ని వ్యతిరేకించే తత్వవేత్తలు, ప్రకృతిశాస్త్రజ్ఞులు కూడ వున్నారు.

19 వ శతాబ్దం మధ్యలో జాన్‌ముల్లర్ అను జర్మన్ శరీరశాస్త్రజ్ఞుడు మన జ్ఞానేంద్రియాల వ్యవస్థనుగూర్చి పరిశోధనలు జరిపాడు. ఆ సందర్భంలో, వెలుతురు అనే ఇంద్రియానుభూతిని కాంతికిరణాలద్వారానేకాక, విద్యుత్‌ప్రవాహం, యాంత్రికప్రకోపనం మొదలైనవాటిద్వారా కంటినరాన్ని ఉద్రిక్తస్థితికి తేవడంవల్లకూడా కలుగవచ్చునని నిరూపించాడు. దాన్ని ఆధారంచేసుకొని ముల్లర్ ఒక పొరపాటునిర్ధారణకు వచ్చాడు. మన ఇంద్రియానుభూతులు ఆయా జ్ఞానేంద్రియాల స్థితిని మించిన దేన్నీ కలిగించడంలేదనీ, మనకు బాహ్యంగాఉన్న పదార్థాలను గురించి, వాటి ధర్మాలను గురించి అవి ఏమీ చెప్పలేవనీ తెలియజేశాడు. ముల్లర్ సిద్ధాంతం "దేహాత్మకభావవాదం" (Physiological Idealism) అని పిలువబడింది.

హెర్మన్ హెల్మోల్ట్స్ అను 19 వ శతాబ్దపు ప్రఖ్యాత జర్మన్ శాస్త్రవేత్త కూడా. జ్ఞానేంద్రియాలిచ్చే అనుభూతుల్ని నమ్మరాదని తెలియజేశాడు.

ఈ శాస్త్రవేత్తల దృక్పథంతో ఏకీభవించేవారు, ఇంద్రియానుభూతులు ప్రతిబింబాలు కావని భావిస్తారు. అవి కేవలం సాంప్రదాయిక చిహ్నాలు (Conventional signs), సంకేతాలు (Symbols) బీజాక్షరాలు (Hieroglyphics) అనీ, అవి ఒక పరిణామాన్ని సూచిస్తాయేగాని, దాని దిశను చూపులాయేగాని. ఆ పరిణామంయొక్క భౌతికత్వాన్ని మాత్రం ప్రతిబింబించవనీ భావిస్తారు. ఈ దృక్పథం ఇంద్రియానుభూతుల్ని ఒక పెద్ద అగడ్తగా, ప్రవేశించలేని అగడ్తగా, మానవుడ్ని భౌతికప్రపంచంతో పూర్తిగా విడగొట్టే సాధనంగా పరిగణిస్తుంది; భౌతికప్రపంచంతో అతనికి సంబంధం ఏర్పరచే వంతెనగా దాన్ని భావించరు. ఈ దృక్పథాన్ని మనం అంగీకరిస్తే. పదార్థాలను గురించి తెలుసుకోవడం అసాధ్యం అవుతుంది.

అంతేకాక. ఈ అజ్ఞేయదృక్పథం పదార్థాల భౌతికఅస్తిత్వాన్నే నిరాకరించే స్థితికి దారితీయవచ్చు. ఎందుచేతంటే, భౌతికవాస్తవికత అవశ్యంగా కొన్ని చిహ్నాలకు, సంకేతాలకు అనుగుణంగా ఉండదు. తత్వశాస్త్ర చరిత్రలో స్వీయాత్మక భావవాదం (Subjective Idealism) ఈవిషయాన్ని – అంటే ఇంద్రియానుభూతులు భౌతికమైన పదార్థధర్మాల ప్రతిబింబం అనే విషయాన్ని– నిరాకరించడం ద్వారానే రూపొంది బలపడింది. కాని ఈ నిరాకరణ మానవజాతియొక్క అనుభవాని కంతకూ వ్యతిరేకం; విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన వాస్తవవిషయాలన్నిటికీ వ్యతిరేకం.

జంతుజాలం యొక్క పరిణామాన్ని పరిశీలించినట్లయితే మన కొకటి బోధపడుతుంది. జంతువుల జ్ఞానేంద్రియాలు. ఆ తరువాత మానవుని జ్ఞానేంద్రియాలు శరీరానికీ పరిసరాలకూ మధ్యజరిగే ప్రతిస్పందన క్రమంలోనే అభివృద్ధి చెంది, మెరుగుపడ్డాయి. సుదీర్ఘమైన పరిణామ క్రమంలో జ్ఞానేంద్రియాలు బాహ్య పరిసరాలను సరిగా గుర్తించి. మార్గం చూపేటట్లు భౌతిక ప్రపంచంతో పొందిక కుదుర్చుకున్నాయి. లెనిన్ ఈ విధంగా వ్రాశాడు :

> "మానవుని ఇంద్రియానుభూతులు అతని పరిసరాలను గురించి భౌతికంగా సరియైన చిత్రణ ఇచ్చి వుండకపోతే, అతడు జీవశాస్త్ర దృష్ట్యా తన పరిసరాలతో పొందిక కుదుర్చుకొనగలిగేవాడు కాదు." *

ఇంద్రియానుభూతులు పదార్థాలను గురించీ, వాటిధర్మాలను గురించీ దాదాపు వాస్తవమైన జ్ఞానం ఇవ్వకపోతే, మన ఆలోచనకూడ వాస్తవమైనదిగా ఉండదు. ఎందుచేతంటే. అది ఇంద్రియానుభూతులనుంచి ఉద్భవిస్తుంది; వానిమీద ఆధారపడుతుంది. అలాంటప్పుడు నిజమైన జ్ఞానం

---

* లెనిన్ : వర్క్స్ 14 వ సంపుటి. పుట 166. (Materialism and Empirio- Criticism, Moscow, 1952. పుట 180).

ఎక్కడా వుండదు; మానవుడు ఊహా ప్రపంచంలో, భ్రాంతుల ప్రపంచంలో నివసిస్తాడు; అంటే, అతడు జీవించడమే దుర్లభమౌతుంది.

ఇంద్రియానుభూతులలో స్వీయాత్మక అంశం కూడ ఒకటి ఉన్న మాట నిజమే. కారణ మేమంటే. అవి మానవుని జ్ఞానేంద్రియాలతో, అతని నాడీమండలంతో, అతని మనస్సుతో సంబంధం కలిగి వుంటాయి. ఏ ప్రతిరూపం కూడ అసలు వస్తువును నూటికి నూరుపాళ్ళు పోలివుండదు. దాని లక్షణాలను సుమారుగా మాత్రమే అసమగ్రంగా మాత్రమే అందచేస్తుంది. ఐతే ఇంద్రియానుభూతులు కేవలం స్వీయాత్మకమైన మానసిక స్థితులే: "ఇంద్రియానుభూతి భౌతిక ప్రపంచంయొక్క స్వీయాత్మక ప్రతిరూపం," అని లెనిన్ అన్నాడు.†

అందుచేత, ఇంద్రియానుభూతుల్లో భౌతికసత్యం ఉండితీరుతుంది. ఇదే శాస్త్రీయమైన భౌతికవాదదృక్పథం. లెనిన్ ఇలా వ్రాశాడు:

> "భౌతికవాదిగా ఉండడమంటే అర్థం, భౌతికసత్యాన్ని అంగీకరించడ మన్నమాట. అభౌతికసత్యం మనకు జ్ఞానేంద్రియాలద్వారా సాక్షాత్కారమౌతుంది." *

ఇంద్రియస్పందనలద్వారా లభించే ఇంద్రియానుభూతులు, భావాలు, అభిప్రాయాలు జ్ఞానానికి ప్రాతిపదికలు; జ్ఞానంయొక్క ప్రత్యేకతలు. కాని జ్ఞానం ఇక్కడితోనే ఆగిపోదు. అది అభివృద్ధి చెందుతుంది; భావాత్మక ఆలోచన స్థాయికి అది ఆరోహిస్తుంది.

---

† లెనిన్ : వర్క్సు - 14 వ సంపుటి. పుట 108 (Materialism & Empirio Criticism, Moscow, 1952, పుట 130).

* లెనిన్. వర్క్సు - 14 వ సంపుటి. పుట 120 (Materialism & Empirio Criticism, Moscow, 1952. పుట 130).

పరిణామాల అంతర్యాన్ని తెలుసుకోవడమే ఆలోచన

ఈ రెండు స్థాయిలమధ్యనున్న గుణాత్మకవ్యత్యాసాన్ని మార్క్సిస్టు జ్ఞానసిద్ధాంతం గుర్తిస్తుంది. వాటిని ఒకదాన్నుంచి ఒకటి వేరుచేసి చూడదు; వాటిమధ్యనున్న గతితార్కిక సంబంధాన్ని గమనిస్తుంది.

ఆలోచన జ్ఞానసంపాదనక్రమంలో అత్యున్నతమైన రూపమే అయినప్పటికీ, అది ఇంద్రియానుభూతులలోకూడ వుంటుంది. మానవుడు సంవేదన పొందినప్పుడు (Feels) ఆలోచించడంకూడా చేస్తాడు; తన ఇంద్రియానుభూతుల ఫలితాలను అతడు గ్రహిస్తాడు. అలా గ్రహించిన దానిని అవగాహన చేసుకుంటాడు. అదే సమయంలో, మన జ్ఞానానికంతకూ పునాదియైన అనుభవాలను ఆలోచనకు సమకూర్చిపెట్టేవి ఇంద్రియానుభూతులూ, భావాలూ మాత్రమే.

ఇంద్రియజ్ఞానంయొక్క అవకాశాలు పరిమితమైనవి. ఇంద్రియానుభూతులకు అతీతమైన పరిణామాలను గురించిన జ్ఞానం భావనాత్మకఆలోచన (Abstract thought) ద్వారా లభిస్తుంది. ఉదాహరణకు, మనం జ్ఞానేంద్రియాల సహాయంతో కాంతి సెకండుకు 3,00,000 కిలోమీటర్ల వేగంతో (1,86,285 మైళ్ళు) ప్రయాణం చేస్తుందని సరాసరి తెలుసుకొనలేము; ఊహించనూ లేము. కాని కాంతికి ఆవేగం ఉంది. దాన్నిగురించి ఇప్పటికిప్పుడే మనం ఆలోచించగలం. అంతేగాక, సిద్ధాంతగణనముల ఆధారంపై ఆ వేగాన్ని పరికరాలతో కొలవవచ్చు. సెకండులో 10 కోట్ల వంతు అంటే ఎంతకాలప్రమాణమో ఇంద్రియాలతో మనం తెలుసుకోలేం. మెసాన్ల వంటి కొన్ని ప్రాథమిక కణాల జీవితం సరిగ్గా ఇలాగే వుంటుంది. మనం దీన్ని గురించి ఆలోచించగలం. గణితశాస్త్రం నిరంతరం పరిమిత పరిమాణాలను గూర్చీ, అనంతపరిమాణాలను గూర్చీ పరిశోధిస్తుంది. వాటిని మనం జ్ఞానేంద్రియాలతో తెలుసుకోలేం.